thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 110| జగిత్యాల | శనివారం 18 జూలై, 20266 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

ఫిఫా ప్రపంచ కప్ ఫైనల్ కు కనువిందైన వేడుక




11

## భారత రైల్వేలో నూతన శకం



- పట్టాలెక్కిన తొలి హైడ్రోజన్ రైలు
- జింద్-సోనిపట్ మార్గంలో జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోదీ

4

## భారీ ఉగ్రకుట్ర భగ్నం



- గుజరాత్‌లో ఐదుగురు జైషె మహమ్మద్ ఉగ్రవాదుల అరెస్టు
- ఉగ్ర నెట్‌వర్క్ ఏర్పాటు యత్నం.. బాంబు తయారీ కుట్ర వెలుగులోకి
- ఉపా చట్టం కింద కేసు నమోదు.. జులై 24 వరకు ఏటీఎస్ కస్టడీ


4

## 20 వరకు బతికి ఉంటా



- ఆరోగ్యం క్షీణిస్తున్న వేళ సోనమ్ వాంగ్‌చుక్ భావోద్వేగ వ్యాఖ్యలు
- 20వ రోజుకు చేరిన నిరాహార దీక్ష.. పార్లమెంట్ పాదయాత్రకు ప్రజలకు పిలుపు

4




## ప్రభుత్వ ఉద్యోగులకు

# ఆరోగ్య భరోసా

- 'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్' ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం
- 8 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్యం
- 886 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 1,816 రకాల చికిత్సలకు ఉచిత సేవలు
- సచివాలయంలో పథకాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి దామోదర రాజనర్సింహా



2

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలలో అనారోగ్య భయాలను పోగొట్టి, వారికి కొండంత అండగా నిలిచేలా రూపొందించిన 'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్'ను రాష్ట్ర ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించింది. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కలిసి ఈ నూతన పథకాన్ని ప్రారంభించి, ఉద్యోగులకు హెల్త్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ఉద్యోగులు అనారోగ్యానికి గురైతే వైద్య ఖర్చుల కోసం అప్పులపాలవుతున్న దుస్థితిని గమనించి, వారికి సంపూర్ణ నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీకి తానే స్వయంగా ఛైర్మన్‌గా వ్యవహరించానని, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్కలతో కలిసి ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి ఈ పటిష్ట విధానాన్ని రూపొందించామని వివరించారు.

*- హైదరాబాద్, జూలై 17*

# ధరణి అక్రమాలపై 'సిట్' దర్యాప్తు

## తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు

- పంచాయతీల నిధులు ఇక నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకే..
- పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తికి పెద్దపీట వేస్తూ పంచాయతీరాజ్ చట్ట సవరణ
- ధరణి అక్రమ లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్
- బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పునకు, జగిత్యాల డిగ్రీ కాలేజీ పోస్టుల భర్తీకి ఆమోదముద్ర
- దేవాదుల, పాలమూరు, సీతారామ, చిన్న కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టుల అంచనా వ్యయాల పెంపు



2

గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ద్వారా జరిగిన భూ లావాదేవీలపై సమగ్ర విచారణ చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. వివిధ శాఖల అధికారులు, సాంకేతిక నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, ధరణి ప్రారంభమైన నాటి నుంచి జరిగిన అన్ని లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించేందుకు కూడా ఆమోదం తెలిపింది. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూముల లావాదేవీలతో పాటు అక్రమ మ్యుటేషన్లపై ప్రత్యేకంగా విచారణ చేపట్టాలని నిర్ణయించింది. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే బాధ్యులకు నోటీసులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

*- హైదరాబాద్, జూలై 17*

## దేవాదాయ శాఖలో 191 మందికి ఉద్యోగాలు

- తెలంగాణ చరిత్రలో తొలిసారి భారీ స్థాయిలో మతపరమైన నియామకాలు
- రవీంద్రభారతిలో నియామక పత్రాలు అందజేసిన మంత్రి కొండా సురేఖ



2

# ఫిఫా కిక్కు!

నేడు, రేపు ఉదయం 3 గంటల వరకు బార్లు ఓపెన్

ఫుట్‌బాల్ అభిమానులకు తెలంగాణ సర్కార్ గుడ్‌న్యూస్

2

- ఫిఫా కీలక మ్యాచ్‌ల నేపథ్యంలో అర్ధరాత్రి దాటినా మద్యం విక్రయాలకు అనుమతి
- హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పరిధిలోనే వెసులుబాటు





## బాలికపై లైంగిక దాడి

- బెదిరించి పలుమార్లు అత్యాచారం.. గర్భం దాల్చిన బాధితురాలు
- ఇద్దరు యువకులపై పోక్సో కేసు
- నిందితుల కోసం గాలింపు చేపట్టిన పోలీసులు

2

## 850 కిలోల నెయ్యి సీజ్

- రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల స్పెషల్ డ్రైవ్
- కమిషనర్ సంగీత సత్యనారాయణ వెల్లడి



3

రాష్ట్రంలో కల్తీ నెయ్యి తయారీ, విక్రయాలపై ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ ఉక్కుపాదం మోపింది. నెయ్యిలో పామాయిల్, వనస్పతి వంటి ఇతర పదార్థాలు, కొవ్వులు కలుపుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా జూలై 14, 15 తేదీల్లో పోలీసుల సమన్వయంతో విస్తృత తనిఖీలు నిర్వహించామని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ సంగీత సత్యానారాయణ తెలిపారు. కొన్ని లైసెన్స్ పొందిన సంస్థలు తయారు చేసిన నెయ్యిలో ఇతర కొవ్వులు కలిపినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించగా, మరికొన్ని సంస్థలు ఎలాంటి లైసెన్స్, రిజిస్ట్రేషన్ లేకుండానే నెయ్యి తయారీ, విక్రయాలు నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు గుర్తించారు.



## నేడు బీఆర్ఎస్ యువ సంగ్రామ సభ

3

- సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహణకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్
- పోలీసుల నిరాకరణపై న్యాయస్థానాన్ని ఆశ్రయించిన బీఆర్ఎస్
- భారీగా తరలిరావాలని యువతకు పార్టీ పిలుపు

## ఆశ్రమంలో గంజాయి సాగు!

- టాస్క్‌ఫోర్స్ దాడిలో బండారం బట్టబయలు
- 25 గంజాయి మొక్కలు స్వాధీనం
- వికారాబాద్ జిల్లాలో కలకలం..

2



# ప్రభుత్వ ఉద్యోగులకు ఆరోగ్య భరోసా

- 'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్' ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం
- 8 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్యం
- 886 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 1,816 రకాల చికిత్సలకు ఉచిత సేవలు
- సచివాలయంలో పథకాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి దామోదర రాజనర్సింహ




**హైదరాబాద్, జూలై 17:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సమగ్ర ఆరోగ్య భద్రత కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం 'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్'ను ప్రారంభించింది. సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి ఉద్యోగులకు హెల్త్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు వైద్య ఖర్చుల కోసం అప్పులపాలయ్యే పరిస్థితిని తొలగించి, వారికి సంపూర్ణ నగదు రహిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని తీసుకొచ్చామని తెలిపారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ పథకం ద్వారా సుమారు 8 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు వారిపై ఆధారపడిన 29.80 లక్షల మంది కుటుంబ సభ్యులు లబ్ధి పొందనున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 886 నెట్‌వర్క్ ప్రైవేట్ ఆసుపత్రుల్లో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) ప్యాకేజీ రేట్ల ప్రకారం 1,816 రకాల వైద్య, శస్త్రచికిత్సలకు పూర్తిస్థాయి నగదు రహిత చికిత్స అందించనున్నట్లు వివరించారు. పథకం అమలు పారదర్శకంగా ఉండేందుకు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు భట్టి తెలిపారు. ఉద్యోగుల సమస్యలను అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సిఫారసుల మేరకే ఈ పథకాన్ని రూపొందించామని చెప్పారు. గత ప్రభుత్వం ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించిన భట్టి, అప్పట్లో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.10 వేల కోట్ల బిల్లులను తమ ప్రభుత్వం దశలవారీగా చెల్లిస్తోందన్నారు. నెలకు రూ.2 వేల కోట్ల చొప్పున బిల్లులు విడుదల చేస్తున్నామని, ప్రతి 15 రోజులకు ఒకసారి స్వయంగా సమీక్ష నిర్వహిస్తూ పెండింగ్ లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని భట్టి తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి 1.06 కోట్ల కుటుంబాలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నామని గుర్తుచేశారు. ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, అదే స్థాయిలో ఉద్యోగులు కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని భట్టి పిలుపునిచ్చారు. రాష్ట్ర సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థంగా చేరవేయడంలో ప్రభుత్వ ఉద్యోగులు కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చోంగ్తూ, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బెన్ హర్ మహేష్ దత్ ఎక్కా, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# తెల్లవారుజాము వరకు కిక్కు!

## నేడు, రేపు ఉదయం 3 గంటల వరకు బార్లు ఓపెన్

## ఫుట్‌బాల్ అభిమానులకు తెలంగాణ సర్కార్ గుడ్‌న్యూస్

## ఫిఫా కీలక మ్యాచ్‌ల నేపథ్యంలో అర్ధరాత్రి దాటినా మద్యం విక్రయాలకు అనుమతి

## హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పరిధిలోనే..

**హైదరాబాద్, జూలై 17:** ఫిఫా ప్రపంచకప్ కీలక మ్యాచ్‌లను వీక్షించనున్న ఫుట్‌బాల్ అభిమానులకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. జూలై 18, 19 తేదీల్లో జరిగే మ్యాచ్‌ల సందర్భంగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ల పరిధిలోని లైసెన్స్ పొందిన బార్లు, క్లబ్బులు, పర్యాటక బార్లు, మైక్రోబ్రూవరీల పనివేళలను పొడిగిస్తూ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వుల ప్రకారం జూలై 18, 19 తేదీల్లో బార్లు తెల్లవారుజామున 4.30 గంటల వరకు తెరిచి ఉంచేందుకు అనుమతి ఇచ్చారు. అలాగే జూలై 19న జరిగే ఫైనల్ మ్యాచ్ వీక్షణ కోసం జూలై 19--20 మధ్య రాత్రి 3 గంటల వరకు మద్యం విక్రయాలు కొనసాగించేందుకు ప్రత్యేక అనుమతి మంజూరు చేశారు. ఫిఫా ప్రపంచకప్ ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మూడో స్థానం కోసం జూలై 18న జరిగే మ్యాచ్, టైటిల్ పోరు కోసం జూలై 19న జరిగే ఫైనల్‌ను పెద్ద సంఖ్యలో అభిమానులు వీక్షించే అవకాశం ఉండటంతో ఈ వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ ఆమోదం అనంతరం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సడలింపు రాష్ట్రవ్యాప్తంగా కాకుండా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పరిధిలోని అనుమతి పొందిన సంస్థలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు.

# బాలికపై లైంగిక దాడి

## బెదిరించి పలుమార్లు అత్యాచారం.. గర్భం దాల్చిన బాధితురాలు

## ఇద్దరు యువకులపై పోక్సో కేసు నమోదు

## నిందితుల కోసం గాలింపు చేపట్టిన పోలీసులు

**నల్లగొండ, జూలై 17:** నల్లగొండ జిల్లాలో ఓ బాలికపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాలికను బెదిరిస్తూ పలుమార్లు అత్యాచారం చేసినట్లు ఆరోపణలు రావడంతో ఆమె గర్భం దాల్చింది. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఇద్దరు నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, అనుముల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను మొదట ఒక యువకుడు మాయమాటలతో నమ్మించి లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఈ విషయం తెలిసిన మరో యువకుడు, బయటకు చెబుతానని బెదిరిస్తూ ఆమెపై లైంగిక దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కొంతకాలం తర్వాత బాలిక గర్భం దాల్చడంతో విషయం కుటుంబ సభ్యులకు తెలిసింది. తల్లిదండ్రులు ఆరా తీయగా జరిగిన విషయాన్ని బాలిక వెల్లడించింది. వెంటనే వారు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరు నిందితులపై పోక్సో చట్టంతో పాటు సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేసిన పోలీసులు బాధితురాలిని వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తరలించారు. పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టినట్లు తెలిపారు. ఈ ఘటనపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాలికలపై నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఆశ్రమంలో గంజాయి సాగు!

## టాస్క్‌ఫోర్స్ దాడిలో స్వామీజీ బండారం బట్టబయలు

## 25 గంజాయి మొక్కలు, ఎండు గంజాయి స్వాధీనం

## వికారాబాద్ జిల్లాలో కలకలం.. కేసు నమోదు చేసి దర్యాప్తు



**వికారాబాద్, జూలై 17:** ఆధ్యాత్మిక ఆశ్రమం ముసుగులో గంజాయి సాగు చేస్తున్న ఘటన వికారాబాద్ జిల్లాలో వెలుగులోకి వచ్చింది. యాలాల మండలం గోవిందరావుపేట శివారులోని ఓ ఆశ్రమంలో గంజాయి సాగు జరుగుతోందన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి భారీగా గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ అన్వర్ పాషా బృందం ఆశ్రమంపై నిఘా ఉంచి శుక్రవారం దాడులు నిర్వహించింది. తనిఖీల్లో ఆశ్రమ ఆవరణలో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు గుర్తించారు. మొత్తం 25 గంజాయి మొక్కలతో పాటు గణనీయమైన పరిమాణంలో ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్సై నిజాముద్దీన్, యాలాల ఎస్సై విఠల్ రెడ్డి, రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్న గంజాయిని పోలీసులు సీజ్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆశ్రమ నిర్వాహకుడితో పాటు గంజాయి సాగు వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, టౌన్ సీఐ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఆశ్రమంలో గంజాయి సాగు బయటపడటంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక కేంద్రం పేరుతో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ధరణి అక్రమాలపై సిట్

- తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు
- పంచాయతీల సొంత ఆదాయం ఇక నేరుగా బ్యాంకు ఖాతాల్లోకే
- బుల్లెట్ రైలు అలైన్‌మెంట్ మార్పు.. ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపు
- దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల వ్యయాల పెంపునకు ఆమోదం



**హైదరాబాద్, జూలై 17 (ఆర్ఎన్ఎ):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ధరణి అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు నుంచి గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తి వరకు పలు అంశాలపై ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ద్వారా జరిగిన భూ లావాదేవీలపై సమగ్ర విచారణ చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. వివిధ శాఖల అధికారులు, సాంకేతిక నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, ధరణి ప్రారంభమైన నాటి నుంచి జరిగిన అన్ని లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించేందుకు కూడా ఆమోదం తెలిపింది. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూముల లావాదేవీలతో పాటు అక్రమ మ్యుటేషన్లపై ప్రత్యేకంగా విచారణ చేపట్టాలని నిర్ణయించింది. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే బాధ్యులకు నోటీసులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం--2018లోని సెక్షన్ 70(3) సవరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటి వరకు ట్రెజరీలో జమ చేయాల్సిన గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ఇకపై నేరుగా ఆయా గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునే అవకాశం కల్పించింది. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగంగా జరిగే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సవరణను అమల్లోకి తీసుకురావడానికి త్వరలో ఆర్డినెన్స్ జారీ చేయనుంది. జగిత్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన కొత్త పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే పటాన్‌చెరు నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం భూమి కేటాయింపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రయాణికులకు మరింత ప్రయోజనం చేకూరేలా బుల్లెట్ రైలు అలైన్‌మెంట్‌లో మార్పులకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అదేవిధంగా దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు--రంగారెడ్డి, సీతారామ సాగునీటి ప్రాజెక్టుల అంచనా వ్యయాల పెంపునకు కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు రాష్ట్రంలో పరిపాలన సంస్కరణలు, గ్రామీణాభివృద్ధి, భూ పరిపాలనలో పారదర్శకత, మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదపడతాయని ప్రభుత్వం పేర్కొంది.

# దేవాదాయ శాఖలో 191 మందికి ఉద్యోగాలు

- తెలంగాణ చరిత్రలో తొలిసారి భారీ స్థాయిలో మతపరమైన నియామకాలు
- రవీంద్రభారతిలో నియామక పత్రాలు అందజేసిన మంత్రి కొండా సురేఖ
- అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, వాయిద్య కళాకారులతో పాటు పలు విభాగాల్లో భర్తీ
- 'దేవాలయ సేవ ఉద్యోగం కాదు.. భగవంతుని సేవ చేసే పవిత్ర బాధ్యత'

**హైదరాబాద్, జూలై 17:** తెలంగాణ దేవాదాయ శాఖ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోయే ఘట్టానికి శుక్రవారం నాంది పలికింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దేవాదాయ శాఖలో 191 మతపరమైన పోస్టులను భర్తీ చేస్తూ ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్వయంగా ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 47 ప్రధాన దేవాలయాల్లో అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, వాహనపూజ పురోహితులు, సహాయ వంటవారు, డోలు, సన్నాయి, మృదంగం, శృతి, తాళం తదితర విభాగాల్లో మొత్తం 191 మందిని నియమించడం దేవాదాయ శాఖ చరిత్రలో కొత్త అధ్యాయమని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధి, భక్తులకు నాణ్యమైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. దేవాలయ ఉద్యోగం కేవలం ఉపాధి కాదని, భగవంతుని సేవ చేసే పవిత్ర బాధ్యతగా ప్రతి ఉద్యోగి భావించాలని సూచించారు. "భక్తసేవే భగవత్సేవ" అనే భావనతో విధులు నిర్వహిస్తేనే ఆలయాల వైభవం మరింత పెరుగుతుందని అన్నారు. దేవాదాయ శాఖ చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున నియామకాలు చేపట్టడం దైవానుగ్రహంగా భావిస్తున్నానని, శాఖ అధికారులు, ఉద్యోగుల సమిష్టి కృషి వల్లే ఇది సాధ్యమైందని మంత్రి తెలిపారు. దేవాలయాల్లో నిత్యకైంకర్యాలు, వేదపారాయణాలు, ఉత్సవాలు, ధార్మిక కార్యక్రమాలు మరింత క్రమబద్ధంగా నిర్వహించేందుకు ఈ నియామకాలు దోహదపడతాయని పేర్కొన్నారు. దేవాదాయ శాఖ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, 'అర్చకులు మరియు ఇతర ఉద్యోగుల సంక్షేమ నిధి ట్రస్ట్' ద్వారా మరిన్ని ప్రయోజనాలు కల్పిస్తున్నామని మంత్రి వెల్లడించారు. త్వరలో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో ప్రత్యేక సందర్భాల్లో ఆధ్యాత్మిక, ధార్మిక, పురాణ ప్రవచనాల నిర్వహణకు ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. పనితీరు ఆధారంగా దేవాలయాల అన్ని విభాగాల ఉద్యోగులకు అవార్డులు కూడా అందజేస్తామని ప్రకటించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల్లో వరుణయాగాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు. నియామక పత్రాలు అందుకున్న పలువురు ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అవకాశం లభించడంతో భావోద్వేగానికి లోనయ్యారు. దేవుని సన్నిధిలో సేవ చేసే అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, శాఖ డైరెక్టర్ హనుమంతరావు, ధార్మిక సలహాదారు గోవింద హరి, సీతా డైరెక్టర్ విజయ రాఘవాచార్యులు, ఆర్జేసీ రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# 850 కిలోల నెయ్యి సీజ్

- రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల స్పెషల్ డ్రైవ్
- కమిషనర్ సంగీత సత్యనారాయణ




**హైదరాబాద్, జూలై 17 :** రాష్ట్రంలో కల్తీ నెయ్యి తయారీ, విక్రయాలపై ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ ఉక్కుపాదం మోపింది. నెయ్యిలో పామాయిల్, వనస్పతి వంటి ఇతర పదార్థాలు, కొవ్వులు కలుపుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా జూలై 14, 15 తేదీల్లో పోలీసుల సమన్వయంతో విస్తృత తనిఖీలు నిర్వహించామని ఫుడ్ సేఫ్టీ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యానారాయణ తెలిపారు. కొన్ని లైసెన్స్ పొందిన సంస్థలు తయారు చేసిన నెయ్యిలో ఇతర కొవ్వులు కలిపినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించగా, మరికొన్ని సంస్థలు ఎలాంటి లైసెన్స్, రిజిస్ట్రేషన్ లేకుండానే నెయ్యి తయారీ, విక్రయాలు నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు గుర్తించారు. సంబంధిత సంస్థల నుంచి నెయ్యి నమూనాలు సేకరించి టెస్టింగ్ కోసం పంపించామని, పరీక్షల ఫలితాల ఆధారంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఫుడ్ ప్రొడక్ట్స్ స్టాండర్డ్స్ అండ్ ఫుడ్ అడిటివ్స్) రెగ్యులేషన్స్ ప్రకారం నెయ్యిలో 99.5 శాతం పాల కొవ్వు ఉండాలి. తేమ శాతం 0.5 శాతానికి మించకూడదు. నెయ్యిలో పామాయిల్, వనస్పతి వంటి వృక్షజన్య కొవ్వులను కలపడం ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం--2006 ప్రకారం నిషేధం అని ఆమె వివరించారు.

### 850 కిలోల స్వాధీనం

హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 14 సంస్థల్లో తనిఖీలు చేపట్టారు. 15 నెయ్యి సాంపిల్స్‌ను సేకరించారు. వినియోగానికి పనికిరాదని గుర్తించిన 60 కిలోల నెయ్యి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. 850 కిలోల అనుమానాస్పద కల్తీ నెయ్యి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఉత్పత్తులను ప్రయోగశాల నివేదికలు వచ్చే వరకు భద్రపరిచి, నివేదికల్లో కల్తీ నిర్ధారణైతే సంబంధిత ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ సంగీత సత్యానారాయణ స్పష్టం చేశారు. వివిధ జిల్లాల్లో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 65 సంస్థలను ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లను పరిశీలించారు. మొత్తం 91 నెయ్యి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. నిబంధనలు ఉల్లంఘించిన 5 సంస్థలకు నోటీసులు జారీ చేశారు.

### వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

వినియోగదారులు లైసెన్స్ ఉన్న, విశ్వసనీయ సంస్థల నుంచే నెయ్యి కొనుగోలు చేయాలని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ సంగీత సత్యనారాయణ సూచించారు. కొనుగోలు చేసే ముందు FSSAI లైసెన్స్ నంబర్, మాన్యుఫాక్చరింగ్ లేబుల్‌ను తప్పనిసరిగా పరిశీలించాలని పేర్కొన్నారు. కొనుగోలు బిల్లులను భద్రంగా ఉంచుకోవాలని, కల్తీ ఆహార పదార్థాలు లేదా లైసెన్స్ లేకుండా విక్రయాలు జరుగుతున్నట్లు అనుమానం ఉంటే వెంటనే ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు చేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.



# నేడు బీఆర్ఎస్ యువ సంగ్రామ సభ

### సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహణకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

### పోలీసుల నిరాకరణపై న్యాయస్థానాన్ని ఆశ్రయించిన బీఆర్ఎస్

### భారీగా తరలిరావాలని యువతకు పార్టీ పిలుపు

**హైదరాబాద్, జూలై 17:** బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న యువ సంగ్రామ సభకు తెలంగాణ హైకోర్టు అనుమతి ఇచ్చింది. శనివారం ఉదయం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో సభ నిర్వహించుకోవచ్చని షరతులతో కూడిన ఆదేశాలు జారీ చేసింది. సభ సందర్భంగా జాతీయ రహదారులను దిగ్బంధం చేయరాదని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన యువత హామీల అమలును డిమాండ్ చేస్తూ ఈ సభను నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ ప్రకటించింది. నిరుద్యోగ భృతి, ఉద్యోగాల క్యాలెండర్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఆ పార్టీ ఆరోపిస్తోంది. ఈ అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయడమే సభ ప్రధాన ఉద్దేశమని తెలిపింది. మొదట ఈ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో బీఆరెస్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, సభ నిర్వహణకు షరతులతో అనుమతి మంజూరు చేసింది. అనుమతి దరఖాస్తు పెండింగ్‌లో ఉంచిన కారణాలపై కూడా ప్రభుత్వం నుంచి వివరణ కోరినట్లు తెలిసింది.

### కేటీఆర్ పిలుపు

హైకోర్టు తీర్పు అనంతరం బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సామాజిక మాధ్యమం ద్వారా స్పందించారు. యువత గళాన్ని అణిచివేయాలన్న ప్రభుత్వ ప్రయత్నం విఫలమైందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షిస్తూ హైకోర్టు సభకు అనుమతి ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా యువత తరఫున పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు, విద్యార్థులు, యువత పెద్దఎత్తున సరూర్‌నగర్ స్టేడియానికి తరలిరావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

# భరత్‌కు బండి బహుమతి

- కొత్త ఆటో అందజేసిన కేంద్ర మంత్రి
- హిందుత్వ నినాదాలున్న ఆటోను స్వయంగా నడిపిన సంజయ్
- కరీంనగర్‌లో ఐదు కిలోమీటర్ల మేర ఆటో ప్రయాణం

**కరీంనగర్, జూలై 17:** హైదరాబాద్‌లో హిందుత్వ నినాదాలు రాసుకున్నందుకు కొందరు యువకుల దాడికి గురైన ఆటో డ్రైవర్ భరత్‌కు అండగా నిలబడటమే కాకుండా, ఇచ్చిన మాట ప్రకారం ఆయనకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొత్త ఆటోను కొనిచ్చారు. ఈ సందర్భంగా హిందుత్వ నినాదాలతో కూడిన సదరు పాత ఆటోను బండి సంజయ్ కరీంనగర్‌లోని జ్యోతినగర్ ఉన్న తన నివాసం నుండి స్వయంగా నడుపుకుంటూ బయలుదేరారు. అనంతరం ఆటో డ్రైవర్ భరత్‌కు కొత్త ఆటోను అందజేశారు. వనపర్తి జిల్లాకు చెందిన ఆటో డ్రైవర్ చంచరి భరత్ కుమార్ తన ఆటోపై హిందుత్వ నినాదాలు రాయించుకోవడంతో ఇటీవల హైదరాబాద్‌లో కొందరు వ్యక్తులు ఆటో కవర్‌ను ధ్వంసం చేశారని, అనంతరం పోలీసు స్టేషన్‌కు రావాలని హెచ్చరించారని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఈ విషయాన్ని భరత్ ఇటీవల బండి సంజయ్‌కు వివరించగా, ఆయన పూర్తి అండగా ఉంటానని హామీ ఇచ్చి కొత్త ఆటో అందజేస్తానని ప్రకటించారు. ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం భరత్‌కు కొత్త ఆటోను అందజేసిన బండి సంజయ్, హిందుత్వ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నందుకు అతన్ని అభినందించారు. భవిష్యత్తులో కూడా తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. అనంతరం కరీంనగర్ నగరంలోని లక్ష్మీనగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే విద్యారణ్యపురి ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.





# సైదాబాద్ స్కూల్ ఇస్లాం బోధన వ్యవహారం

### తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసుల కేసు నమోదు

**హైదరాబాద్, జులై 17:** నగరంలోని సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ స్కూల్లో వివాదాస్పద ఇస్లాం బోధనపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై తీవ్ర దుమారం చెలరేగడంతో తల్లిదండ్రుల ఫిర్యయాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సైదాబాద్ ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థితో బలవంతంగా ఇస్లామిక్ ప్రార్థనలు చేయించడం తీవ్ర సంచలనం రేపింది. క్లాస్ రూమ్‌లో సదరు బాలుడితో కల్మాలో భాగమైన సూరా అల్-ఫాతిహా పఠనం చేయాలని ఆదేశించడం తీవ్ర వివాదానికి దారితీసింది. రోజూ దానిని చదవాలంటూ స్కూల్ డైరీలో 'సూరా అల్ ఫాతిహా' అని రాసి ఒత్తిడి తెచ్చారని బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ మత విశ్వాసాలకు విరుద్ధంగా స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు ప్రవర్తించడం వల్లే తమ కుమారుడు భయాందోళనకు గురై రోజూ ఏడుస్తూ ఇంటికి వస్తున్నాడని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వేధింపుల వల్ల తమ మత స్వేచ్ఛతో పాటు తల్లిదండ్రుల హక్కులకు భంగం కలిగిందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సైదాబాద్ పోలీసులు ప్రాథమిక సమాచార నివేదిక నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పాఠశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం, క్లాస్ టీచర్‌లను నిందితులుగా చేరుస్తూ.. కేసు నమోదు చేసినట్లు పోలీసులు స్పష్టం చేశారు. బాలుడిపై మానసిక ఒత్తిడి తెచ్చిన ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటామని సైదాబాద్ పోలీసులు వెల్లడించారు.

# మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు మంచినీరు

### మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు నిర్ణయం

**హైదరాబాద్, జూలై 17:** హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మల్లన్నసాగర్ జలాశయం నుంచి రోజుకు అదనంగా 25,30 మిలియన్ గ్యాలన్ల (ఎంజీడీలు) నీటిని తరలించాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు నిర్ణయించింది. సింగూర్, మంజీర జలాశయాల్లో నీటి నిల్వలు వేగంగా తగ్గుతున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపడుతోంది. మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా మల్లన్నసాగర్ నీటిని హైదరాబాద్‌కు మళ్లించేందుకు సుమారు 4 కిలోమీటర్ల కొత్త పైప్‌లైన్ నిర్మాణానికి అవసరమైన అనుమతులు లభించాయి. ఈ పనులను 50 నుంచి 60 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశిరచారు. వర్షాభావ పరిస్థితులు కొనసాగినా నగరంలో తాగునీటి కొరత ఏర్పడకుండా ప్రత్యామ్నాయ జల వనరులను వినియోగించేందుకు జలమండలి కార్యాచరణ చేపట్టింది. అలాగే నగరానికి అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, రోజువారీ అవసరాలు, భవిష్యత్ డిమాండ్‌పై సమగ్ర అంచనా వేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# 60శాతం సర్ డిజిటైజేషన్ పూర్తి

### రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 17:** రాష్ట్రంలో ఇప్పటి వరకూ సర్ ప్రక్రియ 60 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలోని సుల్తాన్పూర్, ఐలాపూర్, పటాన్ చెరులో బీఎల్వోలు నిర్వహిస్తున్న సర్ శిబిరాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. సర్ ప్రక్రియపై బీఎల్వోలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. శిబిరాల వద్ద వివిధ పార్టీలకు చెందిన వారు ఉండటాన్ని గమనించి.. మీకు పార్టీ నుంచి గుర్తింపు కార్డులు ఏమైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. సర్ గడువు పొడిగింపు తేదీని దృష్టిలో పెట్టుకొని ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం, పట్టణ ప్రాంతాల్లో 45 శాతం అయిందని తెలిపారు. పీఎల్వో, బీఎల్వోల సహకారంతో సర్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఎన్యూమరేషన్ పత్రాలు అందకపోతే.. సూపర్ వైజర్‌లను అడిగి తీసుకోవాలన్నారు.

# ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదం

### ఇద్దరు వ్యక్తుల దుర్మరణం

**హైదరాబాద్, జులై 17:** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున ఓఆర్ఆర్‌పై జరిగిన ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. రోడ్డుపక్కన నిలిపి ఉన్న ట్రాలీ ఆటోను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. మృతులు రాములు (60), రషీద్ (40)గా గుర్తించారు. సమాచారం అందిన వెంటనే కీసర పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతులిద్దరూ మెదక్ జిల్లా వాసులుగా తెలుస్తోంది. ట్రాలీ ఆటోను ఢీకొట్టిన అనంతరం గుర్తుతెలియని వాహన డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇద్దరి మృతి సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పిల్లలతో కలిసి తల్లుల ఆత్మహత్య

- రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో విషాద ఘటనలు
- కుటుంబ కలహాల కోణంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు





**రంగారెడ్డి/నాగర్‌కర్నూల్:** ఒకేరోజు రెండు వేర్వేరు ప్రాంతాల్లో కన్నపిల్లలతో కలిసి తల్లులు ఆత్మహత్యకు పాల్పడిన ఘోర ఉదంతాలు తీవ్ర కలకలం రేపాయి. క్షణికావేశంలో కన్నప్రేమను మరిచి పిల్లలను సైతం మృత్యువులోకి నెట్టిన ఈ ఘటనలు రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో జరిగాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో ఓ తల్లి తన ఇద్దరు పిల్లలను బావిలోకి తోసి, తాను కూడా దూకి ఆత్మహత్య చేసుకుంది. వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన వసంత (35), సుధాకర్ దంపతులు కొంతకాలంగా కొత్తపల్లిలో నివాసం ఉంటున్నారు. వీరికి 15 ఏళ్ల కుమార్తె, 10 ఏళ్ల కుమారుడు ఉన్నారు. భార్యాభర్తల మధ్య గత కొంతకాలంగా సాగుతున్న విభేదాల నేపథ్యంలో, గురువారం రాత్రి ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన వసంత.. రాత్రి వేళ పిల్లలిద్దరినీ తీసుకుని ఇల్లు వదిలి బయటకు వచ్చేసింది. ఊరి చివరన ఉన్న ఒక వ్యవసాయ బావి వద్దకు వెళ్లి, కన్నపిల్లలిద్దరినీ బావిలోకి తోసేసి, ఆపై తాను కూడా దూకేసింది. ఈ ప్రమాదంలో వసంతతో పాటు ఆమె కుమార్తె నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. అయితే, బావిలోకి తోసిన సమయంలో 10 ఏళ్ల బాలుడు అదృష్టవశాత్తూ లోపల ఉన్న చెట్టు కొమ్మలకు చిక్కుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటనలో నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పోతేపల్లి గ్రామంలో ఇద్దరు పసిపిల్లలతో కలిసి ఓ యువతి బలవన్మరణానికి పాల్పడింది. గ్రామానికి చెందిన ఎనుముల శిరీష (23) అనే వివాహితకు మూడేళ్ల కుమార్తె మానశ్రీ, నాలుగు నెలల పసికందు వర్షిత్ ఉన్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని చూసుకుని శిరీష తీవ్ర నిర్ణయం తీసుకుంది. తన ఇద్దరు బిడ్డలను ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపు (అండర్‌గ్రౌండ్ వాటర్ ట్యాంక్) లో పడేసి, అనంతరం తాను కూడా అందులోకి దూకేసింది. నీటిలో మునిగి తల్లీ, ఇద్దరు పిల్లలు అక్కడికక్కడే ఊపిరాడక మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీశారు. కుటుంబ కలహాల వల్లే శిరీష ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఒకేరోజు ఇద్దరు తల్లులు పసిప్రాణాలను బలితీసుకుని ఆత్మహత్యలకు పాల్పడటంతో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి.



# పార్లమెంట్‌లో పోరుకు రంగం సిద్ధం!

వర్షాకాల సమావేశాల్లో అధికార-ప్రతిపక్షాల శక్తిపరీక్ష

## డీలిమిటేషన్ బిల్లుపై వేడెక్కనున్న ఉభయ సభలు

నీట్, రామమందిరం, ధరల పెరుగుదలపై కేంద్రాన్ని నిలదీయనున్న కాంగ్రెస్

కీలక బిల్లులతో ముందుకు సాగాలని ఎన్‌డీఏ వ్యూహం

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు సమయం ఆసన్నమైంది. ఈ సమావేవాలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకోబోతున్నాయి. ఈ క్రమంలో ఎవవరి వ్యూహాల్లో వారు ఉన్నారు. విపక్ష పార్టీలు కూడా తగిన వ్యూహాలతో సిద్ధం అవుతున్నారు. అధికార పార్టీ వేసే ఎత్తుగడలకు ధీటుగా నిలవాలని ఇండియా కూటిమి సన్నద్ధం అవుతోంది. సోమవారం నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత జరుగుతున్న సమావేశాలు కాబట్టి ఈసారి హాట్‌హాట్‌గా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు కాంగ్రెస్ వ్యూహం సిద్ధం చేసింది. అయోధ్య రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, విద్యా వ్యవస్థలో అవ్యవస్థలు, అవినీతి, ధరల పెరుగుదల, విదేశాంగ వైఫల్యాలు వంటి కీలక అంశాలపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించింది. అలాగే నియోజక వర్గాల పునర్విభజన, మంత్రులు-ముఖ్యమంత్రుల తొలగింపుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. డీలిమిటేషన్‌పై అఖిలపక్ష భేటీ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అయితే అధికార ఎన్‌డిఎ పెద్దగా పట్టించుకోవడం లేదు. గత పార్లమెంట్ సమావేశాలకు ముందు కూడా ఇలాంటి డిమాండ్ వచ్చింది. అయినా కేంద్రం పెద్దగా పట్టించుకోలేదు. పార్లమెంటులో చర్చించే ముందు అఖిలపక్షంతో చర్చించడం ఆనవాయితీ ఉండేది. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత దానిని తుంగలో తొక్కారు. అఖిలపక్షాలు ఏర్పాటు చేయడం, చర్చించడం మోడీకి పెద్దగా ఇష్టం ఉండదని గత 12 ఏళ్లుగా చూస్తున్నాం. ఇకపోతే జూలై 20 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశమై వ్యూహాన్ని ఖరారు చేసుకుంది. రామ మందిర విరాళాల దుర్వినియోగం, ప్రశ్నాపత్రాల లీకులు, విద్యా వ్యవస్థలో క్షీణత, రాజ్యాంగ సంస్థల బలహీనత, రాజకీయ పార్టీల విభజన, అవినీతి, ధరల పెరుగుదల, విదేశాంగ వైఫల్యాలు, ఎథనాల్ మిశ్రమ ఇంధన విధానం, అటవీ నరికివేత, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీల హక్కులపై దాడులు వంటి అంశాలపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లి కార్జునఖర్గే తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా డీలిమిటేషన్ బిల్లును మళ్లీ తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్.. ఆరోపించారు. ఏప్రిల్ 17న ప్రభుత్వం రెండు మూడవ వంతు మెజారిటీ సాధించడంలో విఫలమైందని, ఇప్పుడు మరోసారి అదే బిల్లును తీసుకురావాలని చూస్తోందన్నారు. డీలిమిటేషన్ బిల్లును కాంగ్రెస్ గతంలో ఎలా వ్యతిరేకించిందో ఇప్పటికీ అదే వైఖరి కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అలాగే 30 రోజుల పాటు జైలులో ఉన్న మంత్రులు, ముఖ్యమంత్రులను పదవి నుంచి తొలగించే రాజ్యాంగ సవరణ బిల్లును కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తామని వెల్లడించారు. వన్ నేషన్-వన్ ఎలక్షన్ అంశంపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ జేపీసీపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు జైరాం రమేష్ తెలిపారు. అలాగే వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు, జాతీయ ఆహార భద్రత చట్టం-2013 సవరణలు వంటి బిల్లులను కూడా కాంగ్రెస్ పూర్తిగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం తీసుకురానున్న శాసనసభ్య కార్యక్రమాల్లో కాంగ్రెస్ మద్దతు ఇవ్వగల బిల్లు ఏదీ కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్‌ను ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య ఆధారంగానే అమలు చేస్తే కాంగ్రెస్ పూర్తిగా మద్దతు ఇస్తుందని జైరాం రమేష్ స్పష్టం చేశారు. అమిత్ షా రాజకీయ పార్టీలను చీల్చి రెండు మూడవ వంతు మెజారిటీ సాధించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన ఆయన.. అది రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి అవమానమని విమర్శించారు. అయితే బీజేపీకి లోక్‌సభలో రెండు మూడవ వంతు మెజారిటీ సాధ్యం కాదని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు ఇండియా కూటమి సోమవారం వ్యూహ సమావేశం నిర్వహించనుంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఆదివారం అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశమై వర్షాకాల సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలపై చర్చించనుంది. జూలై 20 నుంచి ప్రారంభ మయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13 వరకు కొనసాగే అవకాశం ఉంది. ఈ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రుల తొలగింపుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులతో పాటు పలు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం ఉంది. మరోవైపు నీట్ ప్రశ్నాపత్రాల లీక్, రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, పెరుగుతున్న చమురు ధరలు, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. కేంద్రం కూడా తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నచందంగా వ్యవహరిస్తోంది. దేశం అనేకానేక సమస్యలు ఎదుర్కొంటున్నా, వాటిని పెద్దగా పట్టించుకోవడం లేదు. వాటిపై చర్చించి నిర్ణయం తీసుకునే చొరవ కూడా తీసుకోవడం లేదు. మె-ుత్తంగా ఈ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు ప్రవేశ పెడితే ఎలా నెగ్గుకు వస్తారన్నదే ఆసక్తిగా మారింది. మహిళా బిల్లును కలిపే పెడతారా అన్నది తెలియదు. అఖిలపక్షంలో చర్చించేందుకు ఎందుకనో మోడీ ఇష్టపడడం లేదని తెలుస్తోంది. అదేదో పార్లమెంటులోనే చర్చించాలన్నది ఆయన వ్యూహంగా ఉన్నట్లు అర్థం అవుతోంది.

# భారత రైల్వేలో నూతన శకం

- పట్టాలెక్కిన తొలి హైడ్రోజన్ రైలు
- జింద్-సోనిపట్ మార్గంలో జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోదీ
- కాలుష్య రహిత రవాణాకు కీలక అడుగు.. పర్యావరణహిత సాంకేతికతతో కొత్త అధ్యాయం
- డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా స్వచ్ఛ ఇంధన వినియోగానికి శ్రీకారం



**న్యూఢిల్లీ, జులై 17 :** భారతీయ రైల్వే చరిత్రలో మరో మైలురాయి చేరింది. భారత రైల్వే చరిత్రలో నూతన శకం ఆరంభమైందనే చెప్పాలి. రైల్వే రంగంలో పర్యావరణహిత విధానాలను ప్రవేశపెట్టే దిశగా కీలక ముందడుగు పడింది. దేశంలోనే తొలిసారిగా హైడ్రోజన్‌తో నడిచే రైలు శుక్రవారం పట్టాలెక్కింది. హైడ్రోజన్‌తో నడిచే తొలి రైలును ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించారు. హరియాణాలోని జింద్-సోనిపట్ మధ్య 89 కిలోమీటర్ల మార్గంలో ఈ రైలు ప్రయాణించనుంది. ఉత్తర రైల్వేలో ప్రయోగాత్మక ప్రాజెక్టుగా దీనిని ప్రవేశపెట్టారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ సాంకేతికతను రైల్వేలో వినియోగిస్తున్నారు. హైడ్రోజన్ ద్వారా విద్యుదుత్పత్తి చేసి రైలును నడిపే ఈ సాంకేతికతను డీజిల్ ట్రైన్స్‌కు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చారు. ఈ ప్రాజెక్ట్‌లో హైడ్రోజన్ నిల్వ, ఇంధనం నింపే ప్రత్యేక సదుపాయాలనూ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'హైడ్రోజన్ రైలు సేవలను ప్రారంభించిన దేశాల జాబితాలో భారత్ చేరడం గర్వకారణం. స్వచ్ఛమైన, సుస్థిర సాంకే తికతను రైల్వే రంగంలో విస్తరించేందుకు ఇది కీలక అడుగుగా నిలుస్తుంది' అని పేర్కొన్నారు. హైడ్రోజన్ రైలు సేవలను ప్రారంభించిన దేశాల జాబితాలో ఇప్పుడు భారత్ కూడా చేరింది. ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే.. రానున్న కాలంలో మరిన్ని మార్గాల్లో ఈ సేవల్ని విస్తరించే అవకాశాలున్నాయి. ఇది రైల్వే రంగంలో కాలుష్య నియంత్రణ, కార్బన్ ఉద్గారాల తగ్గింపు, స్వచ్ఛ ఇంధన వినియోగానికి కొత్త దిశను చూపనుంది. జర్మనీ, జపాన్, చైనా, అమెరికా వంటి దేశాలు హైడ్రోజన్ ఆధారిత రైలు సాంకేతికతను ఇప్పటికే అభివృద్ధి చేస్తున్నాయి. కాగా.. ప్రపంచంలోనే తొలి హైడ్రోజన్ ప్యాసింజర్ రైలును జర్మనీ ప్రవేశపెట్టింది. 2002లో అల్‌స్టోమ్ కొరాడియా ఐలింట్ రైలు ఎలాంటి ఇంధనం లేకుండా 1,175 కి. మీ. ప్రయాణించి రికార్డు సృష్టించింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో 2024లో తొలి హైడ్రోజన్ రైలు సేవలు ప్రారంభమయ్యాయి. అయితే.. 2027 నాటికి జపాన్.. తొలి హైడ్రోజన్ హైబ్రిడ్ రైలును అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. దేశంలో ప్రారంభం అయిన ఈ హైడ్రోజన్ రైలు తొలుత ఉత్తర రైల్వే పరిధిలోని జింద్-సోనిపత్ సెక్షన్‌లో నడుస్తుంది. 89 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. మధ్యలో 12 స్టేషన్లలో ఆగుతుంది. 10 కోచ్‌లతో ఈ రైలును అందుబాటులోకి తెచ్చారు. ఇందులో 2600 మంది ప్రయాణించొచ్చు. త్వరలోనే కల్కా-శిమ్లా వంటి సాంస్కృతిక వారసత్వ రైల్వే లైన్‌లోనూ హైడ్రోజన్ పరిజ్ఞానాన్ని వినియోగంలోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం మన దేశంలో అందుబాటులో ఉన్న విద్యుత్ రైళ్లు.. పైన ఉండే కరెంటు తీగల నుంచి విద్యుత్‌ను తీసుకుంటాయి. ఇక, సంప్రదాయ డీజిల్ రైలు ఇంజిన్లు ఇంధనాన్ని మండించి యాంత్రిక శక్తిని ఉత్పత్తి చేస్తాయి. హైడ్రోజన్ రైలు సొంతంగా కరెంట్‌ను ఉత్పత్తి చేసుకుంటుంది. దీని కోసం రైల్లో 'ప్రోటాన్ ఎక్స్‌ఛేంజ్ మెంబ్రేన్ ఫ్యూయెల్ సెల్' అనే చిన్నపాటి పవర్‌ప్లాంట్ ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా హైడ్రోజన్ రైళ్లు ఇంకా ఆరంభ దశలోనే ఉన్నాయి. తొలిసారిగా జర్మనీ దీన్ని ప్రవేశపెట్టింది. ఫ్రాన్స్, ఇటలీ, చైనా, జపాన్ వంటి దేశాలు ప్రయోగాత్మకంగా నడపడమో లేక పరిమితంగా వినియోగంలోకి తీసు కురావడమో చేస్తున్నాయి. 1,200 కిలోవాట్ల సామర్థ్యం ఉండే ఫ్యూయెల్ సెల్‌లో హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రసాయన చర్య జరుగుతుంది. తద్వారా విద్యుత్ ఉత్పత్తవుతుంది. హైడ్రోజన్‌ను ట్యాంకుల రూపంలో రైలు మోసుకెళుతుంది. ఆక్సిజన్‌ను పరిసరాల్లోని గాలి నుంచి సేకరిస్తుంది. ఇలా ఉత్పత్తయిన విద్యుత్.. రైలులోని ట్రాక్షన్ మోటార్లకు శక్తిని అందిస్తుంది. అవి చక్రాలను నడుపుతాయి. దీని ప్రొపల్షన్ వ్యవస్థ సామర్థ్యం 3,200 హెచ్‌పీ. దీంతో ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వినియోగంలో ఉన్న శక్తిమంతమైన హైడ్రోజన్ రైళ్లలో ఒకటిగా ఇది నిలిచింది. ఇది గంటకు 75 కిలోమీటర్ల వేగంతో ప్ర యాణిస్తుంది. ఇది శుద్ధ ఇంధన పరిజ్ఞానం. ఈ పక్రియలో నీటి ఆవిరి, వేడి మాత్రమే ఉప ఉత్పత్తులుగా వెలువడతాయి. ఇందులో దహనచర్య జరగదు. అందువల్ల హానికారక పొగ, కర్బనఉద్గారాలు వెలువడవు. ధ్వని కూడా తక్కువే. రైల్లోని నాన్‌స్టాప్ వెంటిలేషన్ వ్యవస్థ.. గాలి ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేలా చూస్తుంది. అందువల్ల ఏదైనా లీకేజీ తలెత్తినా అది గాల్లోకి వెళ్లి, పలుచబడిపోతుంది. ప్రమాదాన్ని గుర్తిస్తే.. ఆటోమేటిక్ షట్‌ఆఫ్ వ్యవస్థ తనంతట తాను హైడ్రోజన్ సరఫరాను నిలిపివేస్తుంది. ఈ రైల్లో బహుళ అంచెల భద్రతా వ్యవస్థలు ఉన్నాయి. అవి హైడ్రోజన్ లీకేజీలు, వేడి, మంటలు, పొగ వంటి ముప్పులపై ఎప్పటికప్పుడు కన్నేసి ఉంచుతాయి. ఏదైనా సమస్య ఉత్పన్నమైతే సెకన్లలోనే అప్రమత్తం చేస్తాయి. భద్రతకు ప్రాధాన్యమిస్తూ లోకోపైలట్ క్యాబిన్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. లోకో పైలట్ ఎదుట ఉండే ఒక స్క్రీన్.. అన్ని అంశాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తుంది.

# భారీ ఉగ్రకుట్ర భగ్నం



గుజరాత్‌లో ఐదుగురు జైషే మహమ్మద్ ఉగ్రవాదుల అరెస్టు


ఉగ్ర నెట్‌వర్క్ ఏర్పాటు యత్నం.. బాంబు తయారీ కుట్ర వెలుగులోకి

ఉపా చట్టం కింద కేసు నమోదు.. జులై 24 వరకు ఏటీఎస్ కస్టడీ

**అహ్మదాబాద్, జులై 17:** గుజరాత్‌లో భారీ ఉగ్రకుట్రను రాష్ట్ర ఉగ్రవాద నిరోధక దళం (ఏటీఎస్) భగ్నం చేసింది. పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న జైషే మహమ్మద్ ఉగ్రసంస్థకు చెందిన ఐదుగురు అనుమానితులను అరెస్టు చేసింది. పటన్ జిల్లా సిద్ధ్‌పూర్ తాలూకాలోని ఖడియాల్ గ్రామంలో వారిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అరెస్టయిన వారిని బిలాల్ అబిద్‌భాయ్ షేరా, మహ్మద్ అయూబ్ కడివాలా, మహ్మద్ పాలన్‌పురి, షఫియా రాయిస్ ముక్తి, మహ్మద్ హసన్ కర్దియాగా గుర్తించారు. వారిని మెహసానా జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆర్.ఎం. భాటియా ఎదుట హాజరుపరచగా, జులై 24 వరకు ఏటీఎస్ కస్టడీకి అప్పగిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. గుజరాత్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు కుట్ర పన్నుతున్న నేపథ్యంలో ఈ అరెస్టులు జరిగినట్లు ఏటీఎస్ వెల్లడించింది. ఈ నెల 3న అరెస్టు చేసిన మరో ఎనిమిది మంది అనుమానితులను విచారించగా, తాజాగా పట్టుబడిన ఐదుగురి పాత్ర వెలుగులోకి వచ్చినట్లు తెలిపింది. దర్యాప్తులో ఒక నిందితుడు క్రూడ్ టైమ్ బాంబు తయారు చేసి దానిని పరీక్షించేందుకు ప్రయత్నించినట్లు, మరో నిందితుడు బాంబు తయారీకి అవసరమైన సామగ్రిని అందించినట్లు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో క్రియాశీల ఉగ్ర నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి ఉగ్ర కార్యకలాపాలను విస్తరించడమే వారి లక్ష్యంగా ఉన్నట్లు ఏటీఎస్ పేర్కొంది. నిందితులపై చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా)లోని పలు సెక్షన్లతో పాటు భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత నిబంధనల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# "జులై 20 వరకు ఎలాగైనా బతికి ఉంటా"

- ఆరోగ్యం క్షీణిస్తున్న వేళ సోనమ్ వాంగ్‌చుక్ భావోద్వేగ వ్యాఖ్యలు
- 20వ రోజుకు చేరిన నిరాహార దీక్ష.. పార్లమెంట్ పాదయాత్రకు ప్రజలకు పిలుపు
- ఆరోగ్యంపై వైద్యుల ఆందోళన.. వాంగ్‌చుక్‌ను పరామర్శించిన కాంగ్రెస్ నేత పవన్ ఖేరా




**న్యూఢిల్లీ, జులై 17:** నిరవధిక నిరాహార దీక్ష 20వ రోజుకు చేరుకున్న ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఈ నేపథ్యంలో ఆయన చేసిన భావోద్వేగ వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. తాను శారీరకంగా బలహీనపడుతున్నప్పటికీ, సంకల్పం మాత్రం ఏమాత్రం తగ్గలేదని పేర్కొన్న వాంగ్‌చుక్, "జులై 20 వరకు ఎలాగైనా బతికి ఉంటాను. ఒకవేళ చనిపోతే దెయ్యంగానైనా తిరిగి వస్తాను" అని అన్నారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరాహార దీక్ష కొనసాగిస్తున్న వాంగ్‌చుక్, జులై 20న పార్లమెంట్ వరకు చేపట్టనున్న శాంతియుత పాదయాత్రలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ విన్నపాన్ని పార్లమెంట్ ముందు ఉంచనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, వాంగ్‌చుక్‌కు సంఘీభావంగా నిరాహార దీక్ష చేస్తున్న నేహా, మనీశ్, అమీన్ ఆరోగ్య పరిస్థితి కూడా విషమించిందని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) వెల్లడించింది. డీహైడ్రేషన్ కారణంగా అమీన్ తీవ్ర ప్రమాదంలో ఉన్నారని, నేహా రక్తంలో చక్కెర స్థాయి ప్రమాదకర స్థాయికి పడిపోయిందని, మనీశ్ తన శరీర బరువులో 10 శాతానికి పైగా కోల్పోయాడని తెలిపింది. అయినప్పటికీ తమ డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమం కొనసాగిస్తామని విద్యార్థి నాయకులు ప్రకటించారు. మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పవన్ ఖేరా శుక్రవారం వాంగ్‌చుక్‌ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలన్న వాంగ్‌చుక్ డిమాండ్‌కు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. వాంగ్‌చుక్ ఆరోగ్య వివరాలను విడుదల చేసిన వైద్యుడు సతీశ్ లాంబా ప్రకారం, గత 24 గంటల్లో ఆయన 350 గ్రాముల బరువు కోల్పోయారు. ప్రస్తుతం ఆయన బరువు 56.55 కిలోలకు చేరగా, రక్తపోటు 108/68, రక్తంలో చక్కెర స్థాయి 70 మిల్లీగ్రాములు/డెసిలీటర్, పల్స్ రేటు నిమిషానికి 72గా నమోదైంది. స్వల్ప డీహైడ్రేషన్ ఉన్నప్పటికీ వైద్య బృందం 24 గంటలూ ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తోందని తెలిపారు. దీర్ఘకాలిక నిరాహార దీక్ష కారణంగా శరీరంలోని కొవ్వు, కండరాలు క్షీణించే దశకు చేరిందని, అవయవాలపై ప్రభావం పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలి

.జిల్లా కలెక్టర్ సి.హెచ్ ప్రియాంక

**నారాయణపేట, జూలై,17**



ట్రాఫిక్ నిబంధనల అమలు, అవగాహన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలి: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, IPS జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ప్రజలకు సురక్షిత ప్రయాణం కల్పించడం లక్ష్యంగా జిల్లా కలెక్టర్ సి హెచ్ ప్రియాంక అధ్యక్షతన, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ సమక్షంలో జిల్లా కలెక్టరేట్ లో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించి వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రహదారులపై అవసరమైన హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ లిమిట్ బోర్డులు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.పాఠశాలల పరిసరాలను స్కూల్ సేఫ్టీ జోన్‌లుగా అభివృద్ధి చేసి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.అదేవిధంగా ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించి పాదచారులకు సౌకర్యవంతమైన మార్గం కల్పించాలని, ప్రధాన రహదారులపై పార్కింగ్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి శాఖ తమ పరిధిలోని రోడ్డు భద్రతా పనులపై నివేదికలను సకాలంలో సమర్పించాలని ఆదేశించారు.ప్రమాదాల సమయంలో అత్యవసర వైద్య సేవలు వేగంగా అందించేందుకు 108 అంబులెన్స్ సేవలను మరింత బలోపేతం చేయాలని, జాతీయ రహదారులపై అవసరమైన చోట అదనపు అంబులెన్సులు, అత్యవసర స్పందన కేంద్రాలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సమావేశంలో నిర్ణయించారు.రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేసే గుడ్ సమారిటన్ (Good Samaritan) పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, ప్రమాద బాధితులకు సహాయం చేసే వ్యక్తులను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ...... ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. ఓవర్ స్పీడ్, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్, సీట్ బెల్ట్, మైనర్లు వాహనాలు నడపడం, ఫిట్‌నెస్ లేని వాణిజ్య వాహనాలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని అధికారులకు సూచించారు. రోడ్డు భద్రతపై గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రైవేట్ విద్యాసంస్థల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సూచించారు. సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల పరిధిలో చేపట్టిన చర్యలను వివరించి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సమావేశంలో రవాణా శాఖ, పోలీసు శాఖ, రోడ్లు & భవనాల శాఖ, జాతీయ రహదారుల అధికారులు, ఆర్టీసీ, 108 అంబులెన్స్ సేవలు, విద్యాశాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పీఆర్సీ వెంటనే ప్రకటించాలి

- **పెండింగ్ డీఏలు విడుదల చేయాలి: టీఎస్ యూటీఎఫ్**
- **ఆలేరు మండలంలో సభ్యత్వ ప్రచారం**



ఆలేరు, జూలై 17 :

ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు విమర్శించారు. శుక్రవారం ఆలేరు మండలంలో టీఎస్ యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు నష్టదాయకంగా మారిన జీవో నెం.25ను వెంటనే సవరించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీఓ–2018కు అనుగుణంగా సర్వీసు నిబంధనలు రూపొందించి, పర్యవేక్షణ అధికారుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. టెట్‌లో సర్వీస్ వెయిటేజ్ కల్పించడంతో పాటు సబ్జెక్టుల వారీగా ప్రత్యేక టెట్ నిర్వహించాలని, బీసీ, గిరిజన గురుకులాల టైమ్‌టేబుల్‌లో మార్పులు చేయాలని, మోడల్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేయాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఐదు విడతల కరువు భత్యం (డీఏ)ను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ నివేదికను తక్షణమే ప్రకటించి అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ ఆలేరు మండల శాఖ అధ్యక్షుడు వై. వెంకటేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎండి. సయ్యద్, టాప్రా జిల్లా అధ్యక్షుడు బొమ్మకంటి బాలరాజు, మండల కోశాధికారి అంజయ్య, మండల

# విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- **సంక్షేమ, గురుకుల హాస్టళ్లలో దయనీయ పరిస్థితులు: ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకోవాలి: పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఆర్. ఉదయ్**

**ఆలేరు, జూలై 17 :**



ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు జిల్లాలోని సంక్షేమ, గురుకుల హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా కార్యదర్శి ఆర్ ఉదయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను విరమించి ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. శుక్రవారం ఆలేరులో నిర్వహించిన పీడీఎస్‌యూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఉన్న అనేక సంక్షేమ, గురుకుల హాస్టళ్లలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పలు హాస్టళ్లలో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకపోవడం వల్ల విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతోందని అన్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు లేక విద్యార్థులు హాస్టల్ ఆవరణ వెలుపలికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడం ఆందోళనకరమని పేర్కొన్నారు. తాగునీరు, పరిశుభ్రత, విద్యుత్, నాణ్యమైన భోజనం, భద్రత వంటి కనీస సౌకర్యాలను ప్రభుత్వం తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించేలా చర్యలు తీసుకోవడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థలు విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారం మోపుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రతి విద్యార్థికి అందుబాటు ధరలో నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లాలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న విద్యాసంస్థలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రైవేటు యాజమాన్యాలతో కుమ్మక్కై నిబంధనల ఉల్లంఘనలను పట్టించుకోని జిల్లా విద్యాశాఖ అధికారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు విద్యను ప్రోత్సహించే విధానాలను ప్రభుత్వం విరమించుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైతే జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మామిడాల ప్రవీణ్, నాయకులు ప్రణయ్, దార చందు, భాను, తమ్మడి చరణ్, బన్నీ, లవన్, కిరణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలేరులో మద్రాస్ కేఫ్ ప్రారంభం

- **యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి: ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**
- **రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీర్ల**

**ఆలేరు,జూలై 17 ::**



యువత ఉద్యోగాలకే పరిమితం కాకుండా స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. శుక్రవారం ఆలేరు మున్సిపల్ కేంద్రంలోని బైపాస్ రోడ్డుపై నూతనంగా ఏర్పాటు చేసిన మద్రాస్ కేఫ్ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువత వ్యాపార రంగంలోకి ప్రవేశించి స్వయం ఉపాధిని ఎంచుకోవడంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. స్థానికంగా కొత్త వ్యాపార సంస్థలు ఏర్పాటవడం పట్టణ ఆర్థికాభివృద్ధికి, ఉపాధి అవకాశాల పెరుగుదలకు దోహదపడుతుందని పేర్కొన్నారు. నాణ్యమైన సేవలు అందిస్తూ వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదించాలని సూచించారు.కేఫ్ యజమాని సుమన్ మాట్లాడుతూ, వినియోగదారులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన, రుచికరమైన ఆహార పదార్థాలను అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఫాస్ట్ ఫుడ్, వివిధ రకాల టిఫిన్లు, టీ, కాఫీ తదితర ఆహార పదార్థాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు.వినియోగదారుల సంతృప్తే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు, జిల్లా మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ, పట్టణ అధ్యక్షుడు సాగర్ రెడ్డి, మండల అధ్యక్షుడు గంధమల అశోక్, అరె ప్రశాంత్, పిక్క శ్రీనివాస్, పర్షి గణేష్, కుళ్ల నర్సింహులు, బుగ్గ నవీన్, కర్రే అజయ్, రమేష్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి సరఫరాలో అంతరాయం

DEE & AEE,కొడంగల్,మిషన్ భగీరత విభాగం



**కొడంగల్,జులై,17**

కల్వకుర్తి వద్ద నేషనల్ హైవే పనుల కారణంగా 2300mm Dia MS ప్రధాన పైప్‌లైన్ షిఫ్టింగ్ కారణంగా, కొడంగల్ WTP రా వాటర్ సరఫరా నిలిపివేయబడుతుంది. కావున కొడంగల్ WTP నుండి నీరు పొందే గ్రామాలకు మంచి నీటి సరఫరాలో అంతరాయం కలగనుంది. తేదీ: 2026 జూలై 18 (శనివారం), 11 AM నుండి 11PM వరకు ప్రాంతాలు: కొడంగల్,బొంరస్ పేట, దుద్యాల్, మరియు దౌలతాబాద్ మండలాలు. గమనిక: సమయం దృష్ట్యా కొన్ని గ్రామాలకు 18వ తేదీన, మరికొన్ని గ్రామాలకు 19వ తేదీన నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది.ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించవలసిందిగా కోరుచున్నాము.DEE & AEE, కొడంగల్,మిషన్ భగీరథ విభాగం.

## సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా వుండాలి

డాక్టర్ అమూల్య ప్రియదర్శిని



**దౌల్తాబాద్ మండలం, జులై,17**

వర్షకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ అమూల్య అన్నారు. వర్షాకాలం కావడంతో ఎప్పటికప్పుడు ఆయా గ్రామాల్లో ఆశ కార్యకర్తలతో కలిసి ఏఎన్ఎంలు డ్రై డే చేయాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు..మలేరియా, డెంగ్యూ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా సిబ్బందిని ఆదేశించారు.ఈ అవగాహన కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది సుప్రవేజర్ రఫీ ఉన్నారు.

## భూ నిర్వాసితులకు చెక్కుల పంపిణీ

జిల్లా కలెక్టర్, ప్రియాంక అలా



**హైదరాబాద్ జూలై17**

రాజీవ్ రహదారి SH–01 ఎలివేటెడ్ కారిడార్ సంబంధించిన భూ నిర్వాసితులకు చెక్కులను అందచేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ నందు భూనిర్వాసితులకు నష్టపరిహారం చెక్కుల పంపిణీలో భాగంగా సుమారు నలభై రెండున్నర కోట్ల రూపాయలు అందించటం జరిగింది. భూ నిర్వాసితులు చెక్కులు పొంది సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్. ఏ .ఓ ఎస్ హెచ్–01 అపర్ణ , కార్యాలయ సిబ్బంది , భూనిర్వాసితులు పాల్గొన్నారు.

## బోధన్ జిల్లా ఆసుపత్రి తనిఖీ చేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్, జూలై 17**

బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని కలెక్టర్ ఇలా త్రిపాఠి సందర్శించి వైద్య సేవలు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాల్లో అపరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ పారిశుధ్య కాంట్రాక్టు ఏజెన్సీకి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. పరిస్థితి మెరుగుపడకపోతే కాంట్రాక్టు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ప్రకటించిన కలెక్టర్, గర్భిణుల కోసం బర్త్ వెయిటింగ్ రూం ఏర్పాటు చేయాలని సూచించారు. మెడికో–లీగల్ కేసుల దృష్ట్యా పోలీస్ అవుట్‌పోస్ట్ ఏర్పాటు కోసం ప్రతిపాదన పంపనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ఆర్డీఓ నేతృత్వంలో ప్రతి పక్షం రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

## 'మై భారత్ – విక్షత్ భారత్ రిజిస్ట్రేషన్ డ్రైవ్' పోస్టర్‌ను ప్రారంభించారు

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ



**వికారాబాద్, జులై,17**

వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ బుధవారం కలెక్టరేట్‌లో 'మై భారత్ – విక్షత్ భారత్ ఇంటెన్సివ్ యూత్ రిజిస్ట్రేషన్ & అవేర్‌నెస్ డ్రైవ్' పోస్టర్‌ను అధికారికంగా ప్రారంభించారు.అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట చారి, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్‌డిఓ) వాసు చంద్ర, ట్రైనీ కలెక్టర్ సచిన్ బసవరాజ్ గట్టు, వికారాబాద్ జిల్లా 'మై భారత్' డిప్యూటీ డైరెక్టర్ స్నేహల్ బసుత్కర్, మరియు 'మై భారత్' సిబ్బంది సభ్యుడు శ్రీశైలం యాదవ్ సమక్షంలో ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వికారాబాద్ జిల్లా యువత 'మై భారత్' పోర్టల్‌లో నమోదు చేసుకుని, దేశ నిర్మాణం, స్వచ్ఛంద సేవ, నైపుణ్యాభివృద్ధి, మరియు యువత భాగస్వామ్య కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. 'విక్షత్ భారత్' దార్శనికతకు దోహదపడే అర్థవంతమైన అవకాశాలతో యువతను అనుసంధానించడమే ఈ రిజిస్ట్రేషన్ డ్రైవ్ లక్ష్యమని ఆయన చెప్పారు.జిల్లా వ్యాప్తంగా నమోదు మరియు అవగాహన కార్యక్రమాన్ని ఘన విజయం సాధించేందుకు విద్యాసంస్థలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద కార్యకర్తలు తమ మద్దతును అందించాలని అధికారులు ప్రోత్సహించారు.

## ఫైనాన్స్ సంస్థలు,జ్యువెలరీ దుకాణాల్లో భద్రతా ఏర్పాట్ల పరిశీలన



**మరిపెడ,జూలై17 :**

మరిపెడ పట్టణంలోని ఫైనాన్షియల్ సంస్థలు,పాన్ బ్రోకర్స్,జ్యువెలరీ షాపుల్లో భద్రతా ఏర్పాట్లను శుక్రవారం మరిపెడ ఎస్సైలు గండ్రాతి సతీష్, ప్రభాకర్ రెడ్డి పరిశీలించారు.ముతూట్, ఎల్ఎల్ఎఫ్ఎల్,కీర్తన,శ్రీరామ్ ఫైనాన్స్ శాఖలతో పాటు పలు బంగారు ఆభరణాల దుకాణాలను సందర్శించి, కార్యాలయాల్లో అమలులో ఉన్న భద్రతా ప్రమాణాలు,అలారం వ్యవస్థలు, సీసీ కెమెరాల పనితీరు,కవరేజ్‌ను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయా సంస్థల బ్రాంచ్ మేనేజర్లతో మాట్లాడి భద్రతాచర్యల పైవివరాలుతెలుసుకున్నారు.గోల్డ్ లోన్ మంజూరు చేసే సమయంలో రుణగ్రహీతల పూర్తి వివరాలు,గుర్తింపు పత్రాలు,బంగారు ఆభరణాల వివరాలను క్షుణ్ణంగా ధృవీకరించాలని సూచించారు. అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తులు లేదా లావాదేవీలు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆదేశించారు.ఇటీవల కరీంనగర్‌లోని జ్యువెలరీ షాపులో జరిగిన ఘటనల వంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్సైలు తెలిపారు.వ్యాపార సంస్థలు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ పోలీసులతో సమన్వయంగా పనిచేయాలని సూచించారు.

## టీలావత్ తండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం



**మరిపెడ,జూలై17**

మహబూబాబాద్ జిల్లామరిపెడ మండలం గాలివారిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని టీలావత్ తండాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ నారెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..గ్రామ ప్రజలకు మెరుగైన రహదారిసౌకర్యాలుకల్పించడం గ్రామపంచాయతీ లక్ష్యమని,తండాలో రాకపోకలు సులభతరం కావడానికి ఈ సీసీ రోడ్డు ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బల్లెం ఎల్లయ్య, గ్రామకార్యదర్శి,ఎల్లబోయిన సోమయ్య,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు,తండావాసులుపాల్గొన్నారు.గ్రామాభివృద్ధికిఅందరూసహకరించాలని సర్పంచ్ కోరారు.

## రేషన్ కార్డుదారులు జూలై 31లోగా ఈ-కేవైసీ పూర్తి చేయాలి

**ఖమ్మం, జూలై 17**

జిల్లాలోని రేషన్ కార్డుదారులు రేషన్ కార్డులో నమోదైన ప్రతి కుటుంబ సభ్యుడు తమకు కేటాయించిన చౌక ధరల దుకాణానికి వెళ్లి జూలై 31లోగా బయోమెట్రిక్ ఈ–కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున బాబు సూచించారు. కొన్ని రేషన్ కార్డుల్లో ఒకరు లేదా ఇద్దరు సభ్యులు మాత్రమే ఈ–కేవైసీ పూర్తి చేయగా, మిగిలిన వారు ఇంకా చేయించుకోలేదని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిరంతరాయంగా అందాలంటే ప్రతి కుటుంబ సభ్యుడి ఈ–కేవైసీ తప్పనిసరి అని పేర్కొన్నారు. సందేహాలు ఉంటే సంబంధిత చౌక ధరల దుకాణం లేదా మండల పౌర సరఫరాల అధికారులను సంప్రదించాలని సూచించారు.

# మూడ్ మల్ మెగాలిథిక్ మెన్హిర్ సైట్ అభివృద్ధికి చర్యలు

- **జిల్లా కలెక్టర్ తో దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ భేటీ.**



**నారాయణపేట, జులై,17**

నారాయణ పేట జిల్లా కృష్ణా మండలంలోని మూడ్ మల్ బృహత్ శిలా ఫలకాల (మెగాలిథిక్ మెన్హిర్) ప్రదేశానికి సంబంధించిన సర్వే నంబర్ల పరిధిలో ఉన్న మొత్తం ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక తహసీల్దార్‌ను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేద కుమార్, హెరిటేజ్ తెలంగాణ కార్యాలయ విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ నాగ లక్ష్మీ బృందం కలెక్టర్ ప్రియాంకతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేద కుమార్ ముడుమల్ నిలువు రాళ్లకు యునెస్కో గుర్తింపు కోసం ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చోటు దక్కడం తెలంగాణకు గర్వకారణం అని, యూనెస్కో శాశ్వత గుర్తింపు కోసం ప్రభుత్వం కృషి చేస్తోందనీ, నిలువురాళ్ల ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ కు వివరించారు. ఇది వరకు ఇక్కడ ఉన్న కలెక్టర్లు నిలువు రాళ్ళ పరిరక్షణ కోసం అవసరమైన చర్యలు చేపట్టారని తెలిపారు. నిలువు రాళ్ళ ప్రదేశం గుండా వెళ్తున్న విద్యుత్ గ్రిడ్ లైన్‌ను తరలించే అంశంపై వారు కలెక్టర్ తో చర్చించారు.ఈ విషయమై సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డిప్యూటీ కలెక్టర్ ఫణి కుమార్, విద్యుత్ శాఖ ఎస్ ఈ నవీన్, డీ ఈ ఓ గోవింద రాజులు, ఆర్ అండ్ బీ ఈ ఈ వెంకట రమణ, సర్వే ల్యాండ్ ఏ డీ వేణు గోపాల్, పీ ఆర్ ఈ ఈ అశోక్, డీ పీ ఆర్ వో రషీద్, హెరిటేజ్ విభాగ ఏ ఈ నరేష్, మూడ్ మల్ సర్పంచి బాల్ రాజ్ పాల్గొన్నారు.

# పీహెచ్‌సీలో బదిలీ సిబ్బందికి ఘన వీడ్కోలు




**మరిపెడ,జూలై17 :**

మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్‌సీలో సుదీర్ఘకాలంగా ప్రజారోగ్య సేవల్లో విశిష్ట సేవలందించి బదిలీపై వెళ్తున్న వివిధ విభాగాల సిబ్బందికి శుక్రవారం ఘన వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డీఎంహెచ్‌వో డాక్టర్ భూక్యా రవి రాథోడ్,డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న సిబ్బందిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానిం చారు.అనంతరం డీఎంహెచ్‌వో మాట్లా డుతూ ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడంలో బదిలీ అయిన సిబ్బంది కీలక పాత్ర పోషించారని కొనియాడారు.దశాబ్దాల పా టు ప్రజలకు అంకితభావంతో సేవలందించిన వారి కృషి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టనున్న ప్రాంతాల్లో కూడా ఇదే నిబద్ధతతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.సుదీర్ఘ సేవల అనంతరం బదిలీ అయిన వారిలో బి. విజయకు మారి, సిహెచ్. సరళ, మోహినమ్మ, వెంకటేశ్వర్లు, చంద్రకళ,ఏబీటీ సుందరి, నర్సబాయి, ఆర్.పద్మ, ఫెరోజ్,సీనియర్ అసిస్టెంట్ ఎస్. రవిచంద్ర,ఎంఎల్‌హెచ్‌పీ సాయిశ్రీ, ఉన్నారు.ఈకార్యక్రమంలో డాక్టర్ పూజిత, డాక్టర్ స్వామి,డాక్టర్ కిరణ్ సాగర్, పీహెచ్‌ఎన్‌వో మంగమ్మ, హెల్త్ సూపర్వైజర్లు ఆచార్యులు,మాధవి, లలిత కుమారి,పల్లె దవాఖానా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా ఆరోగ్య కార్యకర్తలు,ఆసుపత్రి సిబ్బంది పాల్గొని బదిలీ అయిన ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు.

# హిట్ అండ్ రన్ కేసులో నిందితుడిని పట్టుకోవాలి

- **మృతుడు బానోత్ యాకుబ్ కుటుంబ సభ్యుల ఆందోళన – పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా, జాతీయ రహదారిపై రాస్తారోకో**



**ఆలేరు, జూలై 17 :**

ఆలేరు బైపాస్‌లో జరిగిన హిట్ అండ్ రన్ రోడ్డు ప్రమాదంలో నర్మేట మండలం మల్కాపేట గ్రామానికి చెందిన బానోత్ యాకుబ్ (50) మృతి చెందిన ఘటనలో ఇప్పటివరకు ప్రమాదానికి కారణమైన వాహనం, డ్రైవర్‌ను గుర్తించడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు శుక్రవారం ఆలేరు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం హైదరాబాద్, వరంగల్ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, యాకుబ్ చిరు వ్యాపారం నిర్వహిస్తూ హైదరాబాద్‌కు వెళ్తున్న సమయంలో ఆలేరు బైపాస్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం జరిగి 24 గంటలు గడిచినా ప్రమాదానికి కారణమైన వ్యక్తిని గుర్తించడంలో పోలీసులు ఎలాంటి పురోగతి సాధించలేదని వారు ఆరోపించారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే నిందితుడు ఇంకా బయట తిరుగుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు, పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టి కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించారు. ప్రమాదానికి కారణమైన వాహనం, డ్రైవర్‌ను వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. మృతుడు యాకుబ్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని, కుటుంబానికి ఆయనే ప్రధాన ఆధారమని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన నేపథ్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రమాదానికి కారణమైన వాహనం, నిందితుడిని గుర్తించేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలోనే కేసును ఛేదిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# చేనేత సహకార సంఘం నూతన పాలకవర్గానికి ఘన సన్మానం

**పాలకవర్గానికి సన్మానం చేస్తున్న సంఘ సభ్యులు**



**ఆలేరు, జూలై 17 :**

ఆలేరు చేనేత పారిశ్రామిక సహకార సంఘం నూతన పాలకవర్గాన్ని క్రాంతినగర్ చేనేత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఇటీవల ఆలేరు చేనేత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన దాసి శంకర్, ఉపాధ్యక్షుడు చింతకింది రంగ, కార్యదర్శి గాడిపల్లి రమేష్, ఆలేరు మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు చింతకింది మురళిలను శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు చేనేత ప్రముఖులు మాట్లాడుతూ నూతన పాలకవర్గం చేనేత కార్మికుల సంక్షేమం, సంఘం అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సభ్యులకు చేరవేయడంలో ముందుండాలని ఆకాంక్షించారు. చేనేత రంగానికి మరింత ప్రోత్సాహం లభించేలా కృషి చేయాలని కోరారు. సన్మానానికి స్పందించిన సంఘం అధ్యక్షుడు దాసి శంకర్ మాట్లాడుతూ సభ్యుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం, సంఘం బలోపేతం, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. అందరి సహకారంతో సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చింతకింది వెంకటయ్య, రచ్చ హనుమంతు, ముసునూరి శ్రీనివాస్, మైలబోయిన శ్రీధర్, చింతకింది మార్కండేయ, గుండ్ల శ్రీనివాస్, చింతకింది సిద్దేశ్వర్, శ్రీరాముల శ్రీనివాసు, అంబటి చంద్రమౌళి, రచ్చ సత్తయ్య, పసునూరి యాదగిరి, కుడికాల సత్యనారాయణ, చింతకింది సిద్ధులు, దుస్స విట్టల్, వంగ నరసింహులు, రచ్చ వెంకటేష్, రేగొట్టి వెంకటేష్, బేతి సత్యం, ఎలగందుల కుమార్, చింతకింది ఉమేష్, జిల్లా యాదగిరి, జోగు నరసింహులు, గంజి పరమేష్, గణపురం లక్ష్మణ్, బిర్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎన్ లినో ప్రభావం.. ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

**మెదక్, జూలై 17**




ఎన్ లినో ప్రభావంతో తక్కువ వర్షపాతం, నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు వరికి బదులుగా తక్కువ నీటి వినియోగంతో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ మిల్లెట్స్, పప్పుధాన్యాలు, కూరగాయలు, పామాయిల్ వంటి పంటలను ప్రోత్సహించాలని సూచించారు. బోరు బావులపై ఆధారపడి వరి సాగు చేయవద్దని, భవిష్యత్తులో భూగర్భ జలాలు తగ్గి పంట నష్టం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పర్యటించి రైతులకు పంటల ఎంపికపై అవగాహన కల్పించాలని, బిందు, తుంపర్ల సేద్యం వంటి నీటి పొదుపు పద్ధతులను ప్రోత్సహించాలని ఆదేశించారు. కూరగాయల సాగుకు ప్రభుత్వం ఎకరాకు రూ.9,600 ప్రోత్సాహకం అందిస్తోందని తెలిపారు. అలాగే జిల్లా కంటింజెన్సీ ప్రణాళికను సిద్ధం చేయాలని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు.

చురకలు

శనివారం 18 జూలై 2026

# రాష్ట్ర క్రీడా అకాడమీలు మరియు ప్రాంతీయ క్రీడా వసతి గృహాలలో ప్రవేశాలకు ఎంపికలు

- **తెలంగాణ ప్రభుత్వం జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి బి.శ్రీకాంత్ రెడ్డి**

**వికారాబాద్, జులై,17**

తెలంగాణ క్రీడాకారులకు శుభవార్త – రాష్ట్ర క్రీడా అకాడమీలు మరియు ప్రాంతీయ క్రీడా వసతి గృహాలలో ప్రవేశాలకు ఎంపికలు తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (SATG), హైదరాబాద్ ఆధ్వర్యంలో 2026–27 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని వివిధ క్రీడా అకాడమీలు మరియు ప్రాంతీయ క్రీడా వసతి గృహాలలో (Regional Sports Hostel) ప్రవేశాల కోసం క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 20 నుండి 28 జూలై, 2026 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన & క్రీడల శాఖ అధికారి బి. శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.క్రీడ ఎంపికలు జరిగే కేంద్రం తేదీలు

సైక్లింగ్ సైక్లింగ్ వెలోడ్రోమ్, ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్, హైదరాబాద్ 20-07-2026

రెజ్లింగ్ (బాలురకు మాత్రమే)సైక్లింగ్ వెలోడ్రోమ్, ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్, హైదరాబాద్ 20-07-2026

వాలీబాల్ (బాలురు & బాలికలు) వాలీబాల్ అకాడమీ, సిద్దిపేట 22 & 23-07-2026

వాలీబాల్ (బాలురకు మాత్రమే) వాలీబాల్ అకాడమీ, రాజన్న సిరిసిల్ల 22 & 23-07-2026

అథ్లెటిక్స్ (బాలురకు మాత్రమే) అథ్లెటిక్స్ అకాడమీ, ఖమ్మం 21-07-2026

వాలీబాల్ (బాలురు & బాలికలు) వాలీబాల్ అకాడమీ,మహబూబ్‌నగర్ 25 & 26-07-2026

కబడ్డీ (బాలురకు మాత్రమే) కబడ్డీ అకాడమీ, మహబూబ్‌నగర్ 25 & 26-07-2026

వాలీబాల్ (బాలురు & బాలికలు) వాలీబాల్ అకాడమీ, సరూర్‌నగర్ 20 & 21-07-2026

జిమ్నాస్టిక్స్ (బాలురు & బాలికలు) ప్రాంతీయ క్రీడా వసతి గృహం (RSH), హనుమకొండ 27 & 28-07-2026

స్విమ్మింగ్ (బాలురకు మాత్రమే) ప్రాంతీయ క్రీడా వసతి గృహం (RSH), హనుమకొండ 27 & 28-07-2026

అథ్లెటిక్స్ (బాలురు & బాలికలు) ప్రాంతీయ క్రీడా వసతి గృహం (RSH), హనుమకొండ 27 & 28-07-2026

హ్యాండ్‌బాల్ (బాలురకు మాత్రమే) ప్రాంతీయ క్రీడా వసతి గృహం (RSH), హనుమకొండ 27 & 28-07-2026

రెజ్లింగ్ (బాలురకు మాత్రమే)ప్రాంతీయ క్రీడా వసతి గృహం (RSH), హనుమకొండ 27 & 28-07-2026

హాకీ (బాలురు & బాలికలు) హాకీ అకాడమీ, గచ్చిబౌలి 20 & 21-07-2026

అథ్లెటిక్స్ (బాలురు & బాలికలు) అథ్లెటిక్స్ అకాడమీ, గచ్చిబౌలి 20 & 21-07-2026

హాకీ (బాలురకు మాత్రమే) హాకీ అకాడమీ, వనపర్తి 20 & 21-07-2026

హ్యాండ్‌బాల్ (బాలురకు మాత్రమే) హ్యాండ్‌బాల్ అకాడమీ, ఎల్.బి. స్టేడియం, హైదరాబాద్ 20 & 21-07-2026

ఫుట్‌బాల్ (బాలురకు మాత్రమే) ఫుట్‌బాల్ అకాడమీ, ఎల్.బి. స్టేడియం, హైదరాబాద్ 20 & 21-07-2026

వయోపరిమితి

- జిమ్నాస్టిక్స్ & స్విమ్మింగ్: 10–12 సంవత్సరాలు
- అథ్లెటిక్స్, వాలీబాల్, హాకీ, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, రెజ్లింగ్, సైక్లింగ్: 14–16 సంవత్సరాలు
- సరూర్‌నగర్ వాలీబాల్ అకాడమీ: 16–18 సంవత్సరాలు

**ఎంపిక విధానం**

రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

వయస్సు ధృవీకరణ, వైద్య పరీక్షలు, శారీరక సామర్థ్యం, క్రీడా నైపుణ్యం మరియు గత ప్రతిభ ఆధారంగా ఎంపికలు జరుగుతాయి.

తీసుకురావలసిన ధృవపత్రాలు

- పాఠశాల/కళాశాల బోనాఫైడ్ మరియు వయస్సు ధృవీకరణ పత్రం
- జనన ధృవీకరణ పత్రం లేదా 10వ తరగతి మెమో
- 10 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు

వికారాబాద్ జిల్లాకు చెందిన అర్హులైన బాలురు, బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన & క్రీడల శాఖ అధికారి కోరారు. ఎంపికలకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, వయోపరిమితి, వేదికలు మరియు ఇతర వివరాల కోసం జిల్లా యువజన & క్రీడల శాఖ కార్యాలయం, వికారాబాద్ ను సంప్రదించవచ్చు.పి. నర్సింలు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి వికారాబాద్ జిల్లా

# బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**మరిపెడ,జూలై17**

బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మరిపెడ మండలం బురహాన్ పురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగ్గిళ్ళ వెంకటమ్మ వెంకన్న, డాక్టర్ కిరణ్ సాగర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు.పరిసరాల పరిశుభ్రత తోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు.వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ఇంటి లోపల, బయట పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు.పగటి పూట కుట్టే దోమ వల్ల డెంగ్యూ జ్వరం వస్తుందని, ఈ దోమ మంచినీటి నిల్వల్లో వృద్ధి చెందుతుందన్నారు.దోమల నియంత్రణతో వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.ఇంటి పరిసరాల ప్రాంతాల్లో ఉండే కుండీలు,కూలర్లలో, ఉపయోగంలేని వస్తువుల్లో నీటి నిల్వలను తొలగించాలన్నారు. పరిశుభ్రతను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు.ప్రస్తుత సమాజంలో చాలా మంది బిజీ అయిపోయి ఆరోగ్యం పట్లశ్రద్ధ చూపడం లేదన్నారు. ఫలితంగా తక్కువ వయసులోనే బీపీ, షుగర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారన్నారు.నిత్యం వ్యాయమం చేయడం ద్వారా




ఆరోగ్యంగాజీవించవచ్చునని హితవు పలికారు.సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య నియమాలను ప్రతిఒక్కరూ పాటించాలని కోరారు.ఈ వైద్య శిబిరంలో సుమారు 150మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బాల వికాస సెంటర్ మేనేజర్ గంధసిరి ఉపేంద్ర, ఏఎన్ఎం లలిత,సహా కో ఆర్డినేటర్లు జుజ్జూరి ఉపేంద్ర,కవిత, ఆశ కార్యకర్తలు వెంకటరమణ,గ్రామ పెద్దలు,గ్రూప్ లీడర్లు ఉమా,గ్రూప్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అంకిత భావం, క్రమశిక్షణతో చదవాలి

**జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక.**

**నారాయణపేట, జులై,17**



ప్రభుత్వ ఉద్యోగాల పరీక్షలకు సిద్ధమవుతున్నప్పుడు పూర్తి అంకిత భావం, క్రమశిక్షణతో చదవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రం లోని అశోక్ నగర్ కు వెళ్లే మార్గంలో గల లయన్స్ క్లబ్ భవనంలో ఆ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని, వారియర్స్ డిఫెన్స్ అకాడమీ/లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఇస్తున్న శిక్షణా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ శిక్షణ పొందుతున్న యువతీ యువకులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. సుమారు 15 సంవత్సరాల క్రితం తాను కూడా ఇలాగే ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమయ్యాననీ తెలిపారు. ఇప్పటికీ ఎంతో మంది ఆసక్తితో చదువుకోవడం చూస్తే చాలా సంతోషంగా ఉంటుందన్నారు. శిక్షణ పొందుతున్న వారు గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే, రాయబోయేది కేవలం ఒక పరీక్ష మాత్రమే. మనం 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలు ఎలా రాశామో, ఇదీ అలాంటి మరో పరీక్షగానే భావించాలని చెప్పారు. అనవసరంగా ఒత్తిడికి గురికావద్దన్నారు. ప్రతి ఒక్కరికి అవసరమైంది ఒక్క సీటు మాత్రమే అని "ఎన్ని పోస్టులకు నోటిఫికేషన్ వచ్చింది?", "ఎంత మంది పరీక్ష రాస్తున్నారు?", "పరీక్ష వాయిదా పడుతుంది", "పరీక్ష జరగదు" వంటి పుకార్లను అస్సలు నమ్మరాదని తెలిపారు. ప్రభుత్వ పరీక్షలకు సిద్ధమవుతున్నప్పుడు పూర్తి అంకితభావంతో, క్రమశిక్షణతో చదవాలని ఆమె పునరుద్ఘాటించారు. ఒక్క వారం చదవకుండా వదిలేస్తే, అదే సమయంలో చదవాల్సిన ప్రశ్న పరీక్షలో వచ్చి మార్కులు కోల్పోయే అవకాశం ఉంటుందనే అనే భావనతో ప్రతిరోజూ చదవాలన్నారు. తాను కూడా అదే విధంగా సిద్ధమయ్యాననీ, అదే తనకు మంచి ఫలితాన్ని ఇచ్చిందనీ చెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు హరినారాయణ బట్టాడ్,ఆత్మారామ్ ఎడ్కే, లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడు రవికుమార్ గౌడ్, శ్రీనివాస్ లాహోటీ, బాలాజీ, జనార్దన్, సచిన్ మంగ్గ్లీ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు మొగ్గు చూపాలి: కలెక్టర్

**పెద్దపల్లి, జూలై 17 :**



సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఓదెల మండలంలో పర్యటించిన ఆయన ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించి, పాఠశాలలు, నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు.

# ఫాక్స్ సాగర్ చెరువు FTL వ్యవహారంలో రేవంత్ ప్రభుత్వానికి హైకోర్టులో మెట్టికాయలు

**హైదరాబాద్ జూలై 17**

జీడిమెట్లలోని ఫాక్స్ సాగర్ చెరువు FTL వ్యవహారంలో బలవంతపు చర్యలు తీసుకోవద్దని ప్రభుత్వానికి, హైడ్రాకు హైకోర్టు ఆదేశాలు దూలపల్లి గ్రామంలోని సర్వే నెంబర్లు 118,119,122లు FTL పరిధిలో ఉన్నాయని 2019, 2023 నాటి జీవోలను రద్దు చేసిన ప్రభుత్వం FTL నిర్ధారణపై విచారణ పెండింగ్‌లో ఉందని, అది అయ్యే వరకు భూ వినియోగ మార్పు, ఆ ఇండ్లకు ఉండే అన్ని అనుమతులు రద్దు చేయాలని జీవోలో పేర్కొని, దాని ప్రకారం చర్యలు తీసుకోవాలని హైడ్రాకు, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చిన ప్రభుత్వం దీనికి సవాల్ చేస్తూ, 2013లోని ప్రాథమిక నోటిఫికేషన్ ప్రకారం HMDA వెబ్‌సైట్‌లోని క్యాడస్ట్రల్ మ్యాప్ ప్రకారం సర్వే నెంబర్ 118, 119, 122 FTL కాదు , నేటికీ బఫర్ జోన్ బయట ఉన్నాయని హైకోర్టులో పిటిషన్ వేసిన బాధితులు రికార్డులను పరిశీలించి పిటిషనర్ల ఆస్తులపై ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణ జూలై 27వ తేదీకి వాయిదా

## పుష్కరాల ఏర్పాట్లపై కలెక్టర్ భవేశ్ మిశ్రా సమీక్ష



**నిర్మల్, జూలై 17**

రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సోన్ మండలంలోని పుష్కర ఘాట్లను పరిశీలించిన కలెక్టర్, ఘాట్ల అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులకు కీలక సూచనలు చేశారు. పుష్కరాల నాటికి ఘాట్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, భద్రత, పరిశుభ్రత, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, లైటింగ్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. గత పుష్కరాల్లో నమోదైన భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేయాలని, ఘాట్లకు వెళ్లే మార్గాల్లో సూచిక బోర్డులు, పార్కింగ్ సౌకర్యాలు, రాకపోకలకు అనువైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరిశీలనలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఈఈ అనిల్, తహసీల్దార్ సంతోష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి: కలెక్టర్



**జగిత్యాల, జూలై 17:**

మేడిపల్లి మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి ఆహారం నాణ్యత, రుచిపై అభిప్రాయాలు తెలుసు కున్నారు.డైట్ మెనూను సమర్థవంతంగా అమలు చేయాలని, పోషకాహార ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. వంటశాలల్లో పరిశుభ్రత పాటిస్తూ, సురక్షితమైన వాతావ రణంలో విద్యార్థులకు ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## దేవాదాయ శాఖలో 191 మందికి నేడు నియామక పత్రాలు



**హైదరాబాద్, జూలై 17 :**

రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖలో 191 ఉద్యోగాలకు సంబంధించిన నియామక పత్రాలను నేడు ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించే కార్యక్రమంలో అందజేయనున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తారు. రాష్ట్రంలోని 47 ఆలయాలకు సంబంధించిన అర్చకులు, వేదపండితులు, పరిచా రకులు, వాద్యకారులు తదితర విభాగాలకు ఎంపికైన అభ్యర్థులు ఈ నియామక పత్రాలు అందుకోనున్నారు.

## రోడ్డు భద్రతే లక్ష్యం.. నూతన ఆర్‌టీఓలకు శిక్షణ పూర్తి



**హైదరాబాద్, జూలై 17**

రోడ్డు భద్రతను బలోపేతం చేయడానికి టెక్నాలజీ ఆధారిత అమలు, సమర్థ వంతమైన ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రజల్లో అవగాహనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్, ఐపీఎస్ సూచించారు. రెండు నెలల ఇండక్షన్ శిక్షణ పూర్తి చేసిన ముగ్గురు నూతన ఆర్‌టీఓలకు సర్టిఫికెట్లు అందజేస్తూ, మోటార్ వెహికల్స్ చట్టంపై పూర్తి అవగా హనతో విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమర్థవంతమైన తనిఖీలు, నాణ్యమైన ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్సుల జారీ ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ శాఖ అడిషనల్ కమిషనర్ సి. రమేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## పశ్చిమ బెంగాల్‌లో ఘోర రైలు ప్రమాదం.. ముగ్గురు మృతి

**కొల్‌కతా, జూలై 17**

పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో శుక్రవారం విషాదకర రైలు ప్రమాదం జరిగింది. రైల్వే క్రాసింగ్ వద్ద స్కూల్ వ్యాన్‌ను ప్యాసింజర్ రైలు ఢీకొనడంతో ఇద్దరు స్కూల్ విద్యార్థులు సహా ముగ్గురు మృతి చెందారు. మరో ఐదుగురు విద్యార్థులు గాయపడ్డారు. రైల్వే గేటు తెరిచి ఉండటమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక సమాచారం. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలి: టీడీపీ



**హైదరాబాద్, జూలై 17**

మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని తెలంగాణ తెలుగు దేశం పార్టీ పిలుపునిచ్చింది. డ్రగ్స్ కారణంగా యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని, కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈగల్ (EAGLE)–2025 గణాంకాల ప్రకారం డ్రగ్స్ బాధితుల్లో 18–25 ఏళ్ల యువత 39.4 శాతం, 26–35 ఏళ్ల వారు 26.4 శాతం ఉన్నారని, మొత్తం బాధితుల్లో 35 ఏళ్లలోపు వారు 65 శాతానికి పైగా ఉన్నారని తెలిపింది. డ్రగ్స్‌పై విస్తృత అవగాహన కల్పించి, యువతను ఈ వ్యసనానికి దూరంగా ఉంచేందుకు సమాజమంతా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పార్టీ పేర్కొంది.

## శ్రీరంగం నుంచి తిరుమల శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ



**తిరుమల, జూలై 17**

ఆణివార ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని తమిళనాడులోని శ్రీరంగం శ్రీ రంగనాథస్వామి దేవస్థానం తరఫున తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారికి శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీవారి సారెకు పెద్ద జీయర్ మఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, తమిళనాడు దేవాదాయ శాఖ మంత్రి రమేష్, కమిషనర్ వినయ్ తదితరులు మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా పట్టువస్త్రాలను ఆలయానికి తీసుకెళ్లి స్వామివారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, తమిళనాడు దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ రవిచంద్ర, శ్రీరంగం ఆలయ ఈవో శివరామ్ కుమార్, ప్రధాన అర్చకులు సుందర బట్టర్ తదితరులు పాల్గొన్నారు.

## హైటెక్ సిటీ అమృత్ స్టేషన్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ




**హైదరాబాద్, జూలై 17**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశంలోని 20 రాష్ట్రాల్లో పునరాభివృద్ధి చేసిన 75 అమృత్ రైల్వే స్టేషన్లను ప్రారంభించారు. వీటిలో తెలంగాణలోని హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ కూడా ఉంది. హైటెక్ సిటీ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎ.వి.ఎన్. రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, సికింద్రాబాద్ డీఆర్‌ఎం డా. ఆర్. గోపాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద హైటెక్ సిటీ స్టేషన్‌ను ఆధునిక ప్రయాణికుల సౌకర్యాలతో పునరాభివృద్ధి చేశారు. కొత్త స్టేషన్ భవనం, విశాలమైన వెయిటింగ్ హాల్స్, లిఫ్టులు, ఎస్కలేటర్లు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు, మెరుగైన సైనేజీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ హర్యానాలో జింద్–సోనిపత్ మధ్య దేశంలోని తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలును కూడా జెండా ఊపి ప్రారంభించారు. కాలుష్య రహిత రవాణా దిశగా ఇది 'మేక్ ఇన్ ఇండియా'కి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

## ఎమ్మెల్యేపై వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి

- **ప్రజా సమస్యలపై రాజకీయంగా స్పందించాలి: నిరాధార ఆరోపణలు సరికావు: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గందమల్ల అశోక్**

**ఆలేరు, జూలై 17 :**



ప్రజలకు సేవ చేస్తున్న ప్రజాప్రతినిధులపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం, వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని కాంగ్రెస్ పార్టీ ఆలేరు మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ గందమల్ల అశోక్ అన్నారు. శుక్రవారం ఆలేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై ఇటీవల చేసిన వ్యక్తిగత విమర్శలను తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రభుత్వ విధానాలు, ప్రజా సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలకు రాజకీయంగా సమాధానం చెప్పాల్సింది పోయి వ్యక్తిగత స్థాయిలో విమర్శలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. ముఖ్యంగా మండల బీఆర్‌ఎస్ నాయకుడు కర్రే వెంకటయ్య చేసిన వ్యాఖ్యలు రాజకీయ సంస్కృతికి విరుద్ధమని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కృషి చేస్తున్నారని అశోక్ తెలిపారు. రోడ్లు, తాగునీటి సౌకర్యం, విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనతో పాటు సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పారు. అలాంటి నాయకుడిపై ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఫలించవని స్పష్టం చేశారు. రాజకీయాల్లో విమర్శలు, విభేదాలు సహజమేనని, అయితే అవి వ్యక్తిగత స్థాయికి దిగజారకుండా ప్రజా సమస్యలు, అభివృద్ధి, పాలన అంశాలకే పరిమితం కావాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో పరస్పర గౌరవం పాటించడం ప్రతి రాజకీయ నాయకుడి బాధ్యత అని అన్నారు. ఆరోపణలు చేయాలంటే స్పష్టమైన ఆధారాలతో ప్రజల ముందుకు రావాలని, వ్యక్తిగత దూషణలు, అసభ్యకర వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు.

ఇకపై ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై నిరాధార ఆరోపణలు, అవమానకర వ్యాఖ్యలు కొనసాగితే కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రజాస్వామ్యబద్ధంగా తగిన రీతిలో స్పందిస్తామని గందమల్ల అశోక్ హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కట్టెగొమ్ముల సాగర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ, మున్సిపల్ కౌన్సిలర్ జూకంటి సంపత్, మాజీ పట్టణ అధ్యక్షుడు ఎంఏ ఎజాజ్, మాజీ ఎంపీటీసీ ఆరె ప్రశాంత్, సీనియర్ నాయకులు బీజన భాస్కర్, నీలం వెంకటస్వామి, సర్పంచ్ మోతిలాల్, బుగ్గ నవీన్, యాదగిరి, అందె అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## భూ రీసర్వేకు ఆమోదం తెలపని శిక్షణ సర్వేయర్ల సర్టిఫికెట్ రద్దు చేస్తాం

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ**

**వికారాబాద్, జులై,17**




భూ రీసర్వేకు ఆమోదం తెలపని శిక్షణ సర్వేయర్ల సర్టిఫికెట్ రద్దు చేస్తామని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో భూ రీసర్వేపై శిక్షణ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటివరకు 150 మందికి సర్వే నిర్వాహణపై శిక్షణ ఇచ్చి లైసెన్స్ సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగిందని ఇందులో కొంతమంది భూ రీసర్వేకు ఆమోదం తెలపకుండ ఉన్నారని అట్టి వారి సర్టిఫికెట్ల రద్దుకు ప్రభుత్వానికి సిఫారస్ చేస్తామన్నారు.సంవత్సరాల క్రితం చేపట్టిన భూ సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని భూ రీసర్వేకు లైసెన్స్డ సర్వేయర్ల పాత్ర చాలా ముఖ్యమని కలెక్టర్ తెలిపారు.దీర్ఘకాలిక దృక్పథంతో చేపట్టే భూ రీసర్వేకు సర్వేలో పాల్గొనడం ఉత్తమ అవకాశంగా భావించాలని దీనివల్ల అపారమైన అనుభవాన్ని తమ జీవితాల్లో పొందుతారని కలెక్టర్ తెలిపారు.భూ రీసర్వే మూలంగా భూమి రికార్డులు పూర్తి శుద్ధి చేయబడతాయని దీనికి సంబంధిత శాఖల అధికారుల సహకారం తీసుకొని భూ రీ సర్వేలో పాల్గొనాలని శిక్షణ సర్వేయర్లకు సూచించారు. శిక్షణ సర్వేయర్లకు స్వంత మండలం కాకుండా అందుబాటులోని మండలాలకు నియమించాలని కలెక్టర్ తెలిపారు.శిక్షణ సర్వేయర్లకు ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు చేపట్టేలా అదేవిధంగా పారితోషకాన్ని సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏడి సర్వేకు జిల్లా కలెక్టర్ సూచించారు.ముందుగా శిక్షణ సర్వేయర్లకు జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) కె.వెంకటాచారి భూ రీసర్వేపై పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. శిక్షణ పొందిన సర్వేయర్లకు నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి నియామక పత్రాలను అదనపు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బసవరాజ్ గుట్టూర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి మధుసూదన్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ బుచ్చయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## మధ్యప్రదేశ్ తహసీల్దార్ల ప్రశంసలు అందుకున్న సీఎం ప్రజావాణి

**హైదరాబాద్, జూలై 17 :**

తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం ప్రజావాణి కార్యక్రమం వినూత్నంగా సాగుతోందని మధ్యప్రదేశ్ రాష్ట్ర తహసీల్దార్లు ప్రశంసించారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో నిర్వహించిన 239వ సీఎం ప్రజావాణిని వారు సందర్శించి, కార్యక్రమం నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ కార్యక్రమం విధానాన్ని వారికి వివరించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో సీఎం ప్రజావాణి కీలక వేదికగా పనిచేస్తోందని మధ్యప్రదేశ్ అధికా రులు అభినందించారు. అదే రోజు నిర్వహించిన సీఎం ప్రజావాణిలో మొత్తం 260 దరఖాస్తులు స్వీకరిం చినట్లు అధికారులు తెలిపారు.




## ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, జూలై 17 :**



జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ప్రజలకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 4వ వార్డులో మందమర్రి మండల తహశీల్దార్ పి సతీష్ కుమార్, డిసిసి ప్రతినిధి పిన్నింటి రఘునాథ్ రెడ్డి లతో కలిసి, మందమర్రి మున్సిపాలిటీలోని 19వ వార్డులో మండల తహశీల్దార్ తో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజ్ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం ఆగస్టు 3 వరకు పొడిగించిందని, జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసే విధంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని అధికారులకు సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఓటర్లకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల సేకరణలో బూత్ స్థాయి ఏజెంట్లు అధికారులకు సహకరించాలన్నారు. నింపిన ఫారాలలోని వివరాలను బూత్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు బిఎల్ఓ యాప్ లో స్పష్టంగా నమోదు చేయాలని, అర్హత గల ఓటర్లు స్వయంగా ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చేపట్టాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి, కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని సూచించారు. వర్షాకాలం అయినందున అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించాలని, భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను ఇంటర్మీడియట్ కు ఆధునికరించడం జరిగిందని, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి, నాణ్యమైన విద్య అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆసియా అండర్-23 అథ్లెటిక్స్‌లో స్వర్ణం సాధించిన గురుకుల విద్యార్థిని ప్రవళికకు మంత్రి అడ్లూరి సత్కారం

**హైదరాబాద్, జూలై 17**

చైనాలో జరిగిన తొలి ఆసియా అండర్–23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2026లో మహిళల 4×400 మీటర్ల రిలేలో స్వర్ణ పతకం సాధించిన భారత జట్టులో సభ్యురాలైన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థిని నారిమల్ల ప్రవళికను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సత్కరించి అభినందించారు. సాధారణ కుటుంబం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి దేశానికి స్వర్ణ పతకం అందించడం తెలంగాణకు గర్వకారణమని మంత్రి అన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో క్రీడలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, ఆధునిక వసతులు, నాణ్యమైన శిక్షణతో ప్రపంచ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడలకు ప్రోత్సాహం పెరిగిందని, ఒలింపిక్స్‌లో పతకం సాధించిన వారికి గ్రూప్–1 స్థాయి ఉద్యోగం కల్పించే నిర్ణయం యువతకు మరింత ఉత్సాహాన్నిస్తోందన్నారు. ప్రవళిక కోచ్ పస్పుల పరుశురాముడు, శిక్షక బృందం, తల్లిదండ్రులను మంత్రి అభినందించారు.

చురకలు



# ఎస్సి, ఎస్టి ల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

## రాష్ట్ర ఎస్సి, ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**మంచిర్యాల, జూలై 17 :**

జిల్లాలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్ తెగలకు చెందిన ప్రజల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని రాష్ట్ర ఎస్సి, ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డిసిపి ఏ భాస్కర్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు పి చంద్రయ్య, వి రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్ల శంకర్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి జి శ్రీనివాస్ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి ఎస్సి, ఎస్టి లకు సంక్షేమ పథకాల అమలు, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, ఆశ్రమ పాఠశాలలు, ఆర్ఓఎఫ్ఆర్ చట్టం, ఎస్సి, ఎస్టి గ్రామాలలో మౌలిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్ తెగల వారికి రాజ్యాంగం కల్పించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తూ వారి సంక్షేమ, అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో 56 వేల 969 మంది షెడ్యూల్డ్ తెగలు, 1 లక్ష 99 వేల 493 మంది షెడ్యూల్డ్ కులముల వారు ఉన్నారని, రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం సంక్షేమ పథకాలు వర్తించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు, దుప్పట్లు, బంకర్ బెడ్స్ సమకూర్చడం జరుగుతుందని, వసతి గృహాలు, గురుకులాలలో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన భోజనం అందించడం జరుగుతుందని, సిసి కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సి, ఎస్టి సబ్ ప్లాన్ క్రింద నిధుల కేటాయింపు జరుగుతుందని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో జాబ్ కార్డ్ కలిగిన ప్రతి ఎస్సి, ఎస్టి లకు పని కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఎస్సి, ఎస్టి స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా 20 లక్షల రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని, అంగన్వాడి, గ్రామపంచాయతీ, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు, పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం అభినందనీయమని, తద్వారా కేసులు తగ్గుముఖం పట్టడం సంతోషంగా ఉందని తెలిపారు. వేయి కంటే ఎక్కువగా కేసులు నమోదు అయిన జిల్లాలలో ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటుకు ప్రతిపాదించడం జరిగిందని, జిల్లాలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ చట్టం ప్రకారం గ్రామాలలో సభలు నిర్వహించి అర్హులైన గిరిజనులు, గిరిజనేతరులకు నిబంధనలకు లోబడి పట్టాలు జారీ చేసే విధంగా రెవెన్యూ, అటవీ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో సర్వే చేయాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతిలో రోస్టర్ పద్ధతిని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. జిల్లాలో బెల్ట్ షాపులపై ఆబ్కారీ మధ్య నిషేధ శాఖ ఆధ్వర్యంలో కఠిన చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీలలో ఎస్సి, ఎస్టి పొరుగు సేవల ఉద్యోగులు, సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించాలని, పిఎఫ్ అమలు, భీమా సౌకర్యాన్ని కల్పించాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులములు, తెగల ప్రజలు నివసిస్తున్న గ్రామాలకు రహదారి సౌకర్యం, త్రాగునీటిని అందించాలని, అట్రాసిటీ కేసులను త్వరగా విచారించి, నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని, అట్రాసిటీ బాధితులకు త్వరగా పరిహారం అందించాలన్నారు. జిల్లాలో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలను ప్రోత్సహించాలని, ఉపాధి కల్పనలో ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు. జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలలలో ఎస్సి, ఎస్టి విద్యార్థుల ప్రవేశాల దృష్ట్యా పాఠశాలలకు చెల్లించవలసిన బకాయిలు, కులాంతర వివాహాల ప్రోత్సాహకాలు, విదేశీ విద్య ఉపకార వేతనాలు, ఇతర రంగాలకు సంబంధించిన అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి అందించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్

# జూలై 31లోగా ఈ- కెవైసి పూర్తి చేసుకోవాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు

**మంచిర్యాల, జూలై 17 :**

జాతీయ ఆహార భద్రతా చట్టం పరిధిలో జిల్లాలోని రేషన్ కార్డుదారులందరూ జూలై 31వ తేదీలోగా తప్పనిసరిగా ఈ- కెవైసి ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు తెలిపారు. శుక్రవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ తో కలిసి మండల రేషన్ షాప్ డీలర్ల సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు మాట్లాడుతూ, రేషన్ కార్డులలోని లబ్ధిదారుల వివరాల పారదర్శకతను నిర్ధారించడం, నకిలీ లబ్ధిదారులను గుర్తించి నివారించడం, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ రాయితీ ప్రయోజనాలు నిరంతరాయంగా అందేలా చేయడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ- కెవైసి ప్రక్రియను తప్పనిసరి చేసిందని తెలిపారు. జిల్లాలో ఇంకా గణనీయమైన సంఖ్యలో లబ్ధిదారులు ఈ- కెవైసి పూర్తి చేయలేదని, మండల స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి జిల్లాలో 100 శాతం ఈ- కెవైసి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డులో నమోదైన ప్రతి కుటుంబ సభ్యుడు స్వయంగా సంబంధిత రేషన్ దుకాణానికి, సమీపంలోని ఏదైనా రేషన్ దుకాణానికి వెళ్లి ఈ- పోస్ యంత్రం ద్వారా వేలిముద్రలు నమోదు చేసి ఈ- కెవైసి పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గడువులోపు ఈ-



కెవైసి పూర్తి చేయని లబ్ధిదారులు భవిష్యత్తులో రేషన్ పంపిణీ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున, జిల్లాలోని రేషన్ కార్డుదారులందరూ వెంటనే తమ ఈ- కెవైసి నమోదు పూర్తి చేసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను నిరంతరాయంగా పొందాలని తెలిపారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారులు, మండల రేషన్ షాప్ డీలర్ల సంఘం ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వర్షపు నీటి ఇంకుడు గుంతల నిర్మాణం తప్పనిసరి

## పట్టణ మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు



**మందమర్రి, జూలై 17 :**

పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని 300 చదరపు గజాలు లేదా అంతకంటే ఎక్కువ స్థలం ఉన్న ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల్ సంచయ్ – జల్ భాగీధారి కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటి సంరక్షణ ఇంకుడు గుంతలు తప్పనిసరిగా నిర్మించాలని పట్టణ మున్సిపల్ కమీషనర్ తుంగపిండి రాజలింగు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. భూగర్భ జలాల మట్టాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమం కింద ప్రతి అర్హత గల భవన ఆవరణలో తగిన ప్రమాణాలతో ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని 300 చదరపు గజాలు లేదా అంతకంటే ఎక్కువ స్థలం ఉన్న గృహాలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు, ఇతర సంస్థలు వర్షపు నీటి సంరక్షణ ఇంకుడు గుంతలు తప్పనిసరిగా నిర్మించాలని స్పష్టం చేశారు. మున్సిపల్ అధికారులు నిర్వహించే తనిఖీల సమయంలో ఇంకుడు గుంతలు నిర్మించని భవన యజమానులపై ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూగర్భ జలాల పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.

# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని

- **మంచిర్యాలలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు**
- **4 కూడళ్లలో సిగ్నల్స్ ఏర్పాటు...**
- **మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్**



**మంచిర్యాల, జూలై 17 :**

ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్ తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆయన శుక్రవారం జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని ప్రధాన కూడళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తా, లక్ష్మీ థియేటర్ చౌరస్తా సహా నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు, రద్దీ నివారణ చర్యలపై అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా డిసిపి ఏ భాస్కర్ మాట్లాడుతూ, కార్పొరేషన్ గా అభివృద్ధి చెందిన మంచిర్యాలలో ట్రాఫిక్ క్రమశిక్షణ అత్యంత కీలకమని, వివిధ జిల్లాలు, రాష్ట్రాలకు కలిపే ప్రధాన రహదారులు ఉండటంతో కూడళ్లలో రద్దీ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ ఇంజినీరింగ్ నిపుణుల అధ్యయనం, స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు చొరవతో తొలి విడతలో 4 ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. సిగ్నల్స్ సమర్థంగా పనిచేసేందుకు ఫ్రీ లెఫ్ట్‌లు, బొల్లార్డులు, స్టాప్ లైన్లు ఏర్పాటు చేస్తున్నామని, అవసరమైన చోట్ల ప్యాచ్‌వర్క్, యూ-టర్న్‌లు సైతం ఏర్పాటు చేస్తామని తెలిపారు. 5, 6 రోడ్లు కలిసే కూడళ్లకు ప్రత్యేక ప్రణాళికతో ట్రాఫిక్ నిర్వహిస్తామన్నారు. ప్రజల భద్రత కోసమే ట్రాఫిక్ నియమాలు అని తెలిపారు. సిగ్నల్స్ ఉల్లంఘించడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు సైతం ప్రమాదమని వివరించారు. అందరూ సిగ్నల్స్, రోడ్డు నియమాలు తప్పనిసరిగా పాటించి, పోలీసులకు సహకరించాలని కోరారు. ట్రాఫిక్ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన మార్పులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసిపి ఆర్ ప్రకాశ్, టౌన్ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ హసన్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధు, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మంథనిలో న్యాక్ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ కు రూ.20 కోట్లు



**పెద్దపల్లి, జూలై 17 :**

పెద్దపల్లి జిల్లా మంథనిలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (ఎన్ఏసీ) స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు టీఆర్&బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేంద్రంలో నిర్మాణ రంగానికి సంబంధించిన ఆధునిక సాంకేతికతపై స్వల్ప, దీర్ఘకాలిక శిక్షణ అందించనున్నారు. శిక్షణ పొందిన యువతకు స్వయం ఉపాధితో పాటు దేశీయ, అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కేంద్రం పనిచేయనుంది. ఈ ప్రతిష్ఠాత్మక కేంద్రాన్ని మంథనికి మంజూరు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తర తెలంగాణ యువతకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.

# కల్తీ నెయ్యిపై ఫుడ్ సేఫ్టీ శాఖ ఉక్కుపాదం

## 850 కిలోల అనుమానాస్పద నెయ్యి స్వాధీనం

**హైదరాబాద్, జూలై 17 (సమయం న్యూస్ )**

రాష్ట్రవ్యాప్తంగా కల్తీ నెయ్యి తయారీ, విక్రయాలపై ఫుడ్ సేఫ్టీ శాఖ చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో 850 కిలోల అనుమానాస్పద నెయ్యిని స్వాధీనం చేసుకుంది. జూలై 14, 15 తేదీల్లో నిర్వహించిన డ్రైవ్‌లో మొత్తం 65 సంస్థలను తనిఖీ చేసి 91 నెయ్యి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఐదు సంస్థలకు నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో 14 సంస్థలను తనిఖీ చేసి 15 నమూనాలు సేకరించగా, వినియోగానికి పనికిరాని 60 కిలోల నెయ్యిని ధ్వంసం చేశారు. ప్రయోగశాల నివేదికల్లో కల్తీ నిర్ధారణైతే సంబంధిత సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ తెలిపారు. వినియోగదారులు ఎఫ్ఎస్ఎస్ఏఐ (FSSAI) లైసెన్స్ ఉన్న సంస్థల నుంచే నెయ్యి కొనుగోలు చేయాలని, లైసెన్స్ నంబర్, తయారీ వివరాలు పరిశీలించి కొనుగోలు బిల్లులను భద్రంగా ఉంచుకోవాలని కమిషనర్ సూచించారు.


# ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ లో స్వర్ణం సాధించిన గురుకుల విద్యార్థిని ప్రవళికకు మంత్రి అడ్లూరి సత్కారం



**హైదరాబాద్, జూలై 17**

చైనాలో జరిగిన తొలి ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026లో మహిళల 4×400 మీటర్ల రిలేలో స్వర్ణ పతకం సాధించిన భారత జట్టులో సభ్యురాలైన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థిని నారిమల్ల ప్రవళికను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సత్కరించి అభినందించారు. సాధారణ కుటుంబం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి దేశానికి స్వర్ణ పతకం అందించడం తెలంగాణకు గర్వకారణమని మంత్రి అన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో క్రీడలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, ఆధునిక వసతులు, నాణ్యమైన శిక్షణతో ప్రపంచ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడలకు ప్రోత్సాహం పెరిగిందని, ఒలింపిక్స్‌లో పతకం సాధించిన వారికి గ్రూప్-1 స్థాయి ఉద్యోగం కల్పించే నిర్ణయం యువతకు మరింత ఉత్సాహాన్నిస్తోందన్నారు. ప్రవళిక కోచ్ పస్పుల పరుశురాముడు, శిక్షక బృందం, తల్లిదండ్రులను మంత్రి అభినందించారు.

# బీసీ కులగణన కోసం పార్లమెంట్ లో పోరాడుతా: వద్దిరాజు రవిచంద్ర



**హైదరాబాద్, జూలై 17 :**

బీఆర్ఎస్ పార్లమెంటరీ పక్షనేతగా లభించిన అవకాశాన్ని బీసీల హక్కుల సాధనకు వినియోగిస్తానని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. దేశవ్యాప్తంగా బీసీ కులగణన, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల పెంపు, బీసీ మహిళలకు మహిళా బిల్లులో సబ్‌కోటా వంటి డిమాండ్లపై పార్లమెంట్‌లో గళం విప్పుతానని తెలిపారు. బీఆర్ఎస్ పార్లమెంటరీ పక్షనేతగా ఎంపికైన సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బీసీ ప్రతినిధులు ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కేసీఆర్ తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలుపుతూ, పార్టీ ఇచ్చిన బాధ్యతను బీసీల ప్రయోజనాల కోసం సమర్థంగా వినియోగిస్తానని రవిచంద్ర పేర్కొన్నారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, బీసీ సమస్యలపై అవగాహనతో గతంలోనూ పార్లమెంట్‌లో పోరాడిన అనుభవం రవిచంద్రకు ఉందని, బీఆర్ఎస్ పార్లమెంటరీ పక్షనేతగా ఆయన నియామకం బీసీ సమాజానికి గౌరవమని అన్నారు. బీసీల ప్రధాన డిమాండ్ల సాధనలో పార్లమెంట్‌లో ఆయన కీలక పాత్ర పోషిస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ రాష్ట్ర కో-చైర్మన్ ముప్పు బిక్షపతి రజక, గూడూరు భాస్కర్ మేరు, జాజుల భాస్కర్, బండిగారి రాజు తదితరులు పాల్గొన్నారు.

## యూరిక్ యాసిడ్‌ను తొలగించడానికి

# ఆహార అలవాట్లు మీకు తెలుసా?



### యూరిక్ యాసిడ్ పెరిగినప్పుడు రోగనిరోధక వ్యవస్థపై ప్రభావం

## కీళ్లలోనూ, కీళ్ల చుట్టూ ఉండే కణజాలం దెబ్బతినే అవకాశం

ప్రస్తుతం కాలంలో చాలా మంది యూరిక్ యాసిడ్ సమస్యతో ఇబ్బంది అనారోగ్యానికి గురవుతున్నారు. యూరిక్ యాసిడ్ అనేది మన రక్తంలో కనిపించే వ్యర్థ పదార్థం. శరీరంలో యూరిక్ యాసిడ్ పెరిగినప్పుడు రోగనిరోధక వ్యవస్థ సరిగా పనిచేయదు. దీంతో రకరకాల సమస్యలు మొదలవుతాయి. యూరిక్ యాసిడ్ స్ఫటికాలుగా మారి వేళ్ల కీళ్లలో ఇరుక్కుపోయి తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయి. అంతేకాకుండా దీని వల్ల అనేక ఇతర సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో శరీరం నుంచి యూరిక్ యాసిడ్‌ను తొలగించడానికి కొన్ని ఆహార అలవాట్లు మార్చుకుంటే ఈ సమస్య నుంచి తేలికగా బయటపడొచ్చు

మనం తీసుకునే ఆహారంలోని ప్యూరిన్స్ అనే పదార్థాల విచ్ఛిన్నంలో భాగంగా యూరిక్ యాసిడ్ ఏర్పడుతుంది. రక్తంలోని యూరిక్ యాసిడ్ మూత్రం ద్వారా విసర్జితమవుతుంది. శరీరంలో యూరిక్ యాసిడ్ ఉత్పత్తి పెరిగినా, విసర్జన సరిగా జరగకపోయినా అది రక్తంలోనే నిలిచిపోయి స్ఫటికాలుగా కీళ్లలోనూ, కీళ్ల చుట్టూ ఉండే కణజాలంలో చేరుతుంది. అప్పుడు కీలు వాచిపోయి, కదలికలు కష్టంగా మారతాయి. ఇది గౌట్‌కు దారితీస్తుంది. అధిక బరువు, వయసు పెరగడం, వంశపారంపర్యంగానూ యూరిక్ సమస్య ఎదురవుతుంది. యూరిక్ యాసిడ్ సమస్యను నిర్లక్ష్యం చేస్తే.. అనేక తీవ్రమైన సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది. యూరిక్ యాసిడ్ మోతాదు పెరుగుదల శరీరంలో ఇన్‌ఫ్లమేటరీ రెస్పాన్స్‌ను సృష్టించి, అన్ని అవయవాలనూ ప్రభావితం చేస్తుంది. దీనికారణంగా గుండె, కాలేయం, గాల్ బ్లాడర్, మూత్రపిండాల పనితీరుపై ప్రభావం పడుతుంది. శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గించడానికి కొన్ని ఇంటి చిట్కాలు సహాయపడతాయి. అవేంటో ఈ స్టోరీలో చూసేద్దాం.



ఒక టీస్పూన్ ఆర్గానిక్ యాపిల్ సైడర్ వెనిగర్‌ను ఒక గ్లాసు నీటిలో కలపండి. ఈ నీళ్లు రోజూ తాగితే.. శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. యాపిల్ సైడర్ వెనిగర్ నేచురల్ క్లెన్సర్, డిటాక్సిఫైయర్‌లా పనిచేస్తుంది. యాపిల్ సైడర్ వెనిగర్‌లో మాలిక్ యాసిడ్ ఉంటుంది, ఇది శరీరంలోని యూరిక్ యాసిడ్‌ను విచ్ఛిన్నం చేయడానికి, తొలగించడానికి సహాయపడుతుంది. యాపిల్ పండ్లలోనూ మాలిక్ యాసిడ్ ఉంటుంది. రోజూ ఒక యాపిల్ తిన్నా మేలు జరుగుతుంది.

ఉసిరికాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలో ఇన్‌ఫ్లమేటరీని నివారించడమే కాకుండా, ఆక్సీకరణ ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది. ఇది యూరిక్ యాసిడ్ స్థాయిని కూడా తగ్గిస్తుంది. కాబట్టి ప్రతి రోజూ కనీసం ఒక ఉసిరికాయను తినడం అలవాటు చేసుకోవాలి.



శరీరంలో అధికంగా పేరుకున్న నిమ్మరసాన్ని తొలగించడానికి రోజుకు కనీసం రెండుసార్లు నిమ్మరసం తాగాలని నిపుణులు సూచిస్తున్నారు. నిమ్మరసంలో సిట్రిక్ యాసిడ్ సమృద్ధిగా ఉంటుంది, ఇది యూరిక్ యాసిడ్‌ను విచ్ఛిన్నం చేస్తుంది. మీ డైట్‌లో ఉసిరి, జామ, నారింజ వంటి విటమిన్ సి సమృద్ధిగా ఉండే ఆహార పదార్థాలు తీసుకున్నా మేలు జరుగుతుంది.



**ఎండిన కొత్తిమీర ఆకులు శరీరం నుంచి యూరిక్ యాసిడ్ స్ఫటికాలను తొలగించడంలో సహాయపడతాయి. కొత్తిమీర ఆకుల్లో యూరిక్ యాసిడ్ ను మూత్రంతో తొలగించే గుణాలు ఉంటాయి. యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరిగిన వ్యక్తులు కొత్తిమీర టీ లేదా కొత్తిమీర నీటిని తీసుకుంటే మంచిది.**





**యూరిక్ యాసిడ్ స్ఫటికాలను తొలగించడంలో వేప ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తుంది. వేపలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అధికంగా ఉంటాయి. ఇది వాపును తగ్గిస్తుంది. అలాగే యూరిక్ యాసిడ్ సమస్యను నయం చేస్తుంది. వేప శరీరం మొత్తం నిర్విషీకరణలో కూడా బాగా పనిచేస్తుంది.**

రోజువారీ ఆహారంలో చేపలు తినడం వల్ల యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గించుకోవచ్చు. ఇందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు వాపును తగ్గించడంలో సహాయపడతాయి. ఇవి మూత్రపిండాలు సరిగ్గా పనిచేయడానికి కూడా సహాయపడుతుంది. దీని కారణంగా టాక్సిన్స్ తొలగిపోతాయి. ఫలితంగా యూరిక్ యాసిడ్ శరీరం నుంచి సులభంగా బయటికి పోతుంది.



ఆయుర్వేదంలో కరక్కాయ (మైరోబాలన్)కు ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో నిర్విషీకరణ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలోని టాక్సిన్స్, యూరిక్ యాసిడ్‌లను సులువుగా బయటకు పంపుతుంది. మైరోబాలన్ తీసుకోవడం జీర్ణక్రియకు కూడా మంచిది. దీని సహాయంతో యూరిక్ యాసిడ్ సమస్య నుంచి తేలికగా బయటపడొచ్చు. అలాగే గట్ సమస్యలు కూడా నయమవుతాయి





# ఆలూ పొట్టులో అధిక పోషకాలు

బంగాళదుంపలు ఇష్టపడని వారు ఉండరేమో. ఈ ఆలుగడ్డలతో రకరకాల వంటను చేసుకొని లాగించేస్తుంటారు. అయితే బంగాళదుంప కూర.. లేదంటే చిప్స్, ఇతర వంటకాలు చేసేటప్పుడు.. పొట్టును తీసి పక్కకు పడేస్తుంటాము. అయితే ఆలుగడ్డల పొట్టులోనే అధిక పోషకాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఆలు తొక్కను తీసేస్తే చాలా పోషకాలు మిస్ అయిపోతామని నిపుణులు చెబుతన్నారు. తొక్కపై అంతా మట్టి, దుమ్ము ఉంటాయి కనుక పొట్టును తీసేయాల్సి వస్తుంది. అయితే వాస్తవానికి ఆలూను పొట్టుతో సహ తినాలి. పొట్టులో అనేక విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ముఖ్యంగా ఫైబర్ ఉంటుంది. పొట్టులో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది హైబీపీని తగ్గిస్తుంది. నాడీ వ్యవస్థ పని తీరును మెరుగుపరుస్తుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చూస్తుంది.



### యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలం


ఆలు పొట్టులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా ఫ్లేవనాయిడ్స్, కెరోటినాయిడ్స్, ఫినోలిక్ సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి గుండె జబ్బులు, క్యాన్సర్, నాడీ సంబంధ వ్యాధులు రాకుండా కాపాడుతాయి. ఆర్థరైటిస్, కీళ్లు, మోకాళ్ల నొప్పులు ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. అధిక బరువు సమస్య నుంచి బయట పడతారు. మెరిసే చర్మం మీ సొంతం అవుతుంది. అందుకే ఇప్పటి నుంచైనా ఆలుగడ్డ తొక్కతో వండుకోవడానికి ప్రయత్నించండి. లేదంటే విలువైన పోషకాలు మిస్సవుతారు.

# తల్లిదండ్రుల మనసు నొప్పించకండి..

### ఈ ప్రశ్నలు అడిగి విసిగించకండి



తల్లిదండ్రులు చిన్నప్పుడు మనల్ని ఎలాగైతే కంటికి రెప్పలా కాపాడుకుంటారో.. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను మనం కూడా అలాగే చూసుకోవాలి. అయితే ప్రస్తుత ఉరుకులు, పరుగుల జీవితంలో చాలా మంది తల్లిదండ్రులను భారంగా భావిస్తున్నారు. ఒకవేళ వారి పేరిట ఆస్తిపాస్తులు ఉంటే తప్ప పట్టించుకోవడం లేదు. అయితే తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. వారిని అనవసర ప్రశ్నలు అడిగి విసిగించొద్దంటున్నారు.



shutterstock.com - 231948

### నిర్ణయాలపై ప్రశ్నించొద్దు?

తల్లిదండ్రులు గతంలో తీసుకున్న నిర్ణయాల గురించి వారిని పదే పదే ప్రశ్నించొద్దు.. ఆ నిర్ణయాల గురించి వారిని గుచ్చి గుచ్చి అడగడం.. ఫలానా పని ఎందుకు చేశారని నిలదీయం వారిని హర్ట్ చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

### పోల్చడమూ మంచిది కాదు..

మనం పిల్లల్ని ఇతర పిల్లలతో పోల్చడం కరెక్ట్ కాదు.. అలాగే వృద్ధులైన తల్లిదండ్రులను ఫలానా వాళ్లతో పోల్చి మీరు వాళ్లకంటే ఎక్కువ ఎందుకు సంపాదించలేదు? వారిలా ఆస్తులు ఎందుకు కూడబెట్టలేదు.. అని అడగడం కరెక్ట్ కాదంటున్నారు నిపుణులు. ప్రతి ఒక్కరూ ఏదైనా ఓ విషయంలో ఫెయిల్ అవుతూనే ఉంటారు. దీని గురించి మళ్లీ ప్రస్తావించకూడదు. వారి ఎక్స్ లవ్, మాజీ ప్రేమ, పెళ్లి వంటి అంశాలను వారిని అడిగి బాధపెట్టొద్దు.

### సంబంధాలు..

తల్లిదండ్రులు వారు ఎన్నో అనుభవాలని చూసే వచ్చారు. కానీ, వీటి గురించి ఆలోచించక చాలా మంది వారి సంబంధాల గురించి మాట్లాడతారు. వారి పర్సనల్స్, రొమాన్స్ గురించి మాట్లాడడం మంచిది కాదు. తల్లిదండ్రుల్ని ఎప్పుడైనా ఆర్థిక విషయాల గురించి ఆరా తీసి ఇబ్బంది పెడతారు కొంతమంది పిల్లలు. మీరు ఎంత డబ్బు సంపాదించారు? ఎవరికిస్తారు. వీలునామా రాశారా అంటూ ఆరాలు తీస్తారు. కానీ, ఇవి అంత మంచిది కాదు. వీని వారు ఇష్టముంటేనే చెప్పేలా చూసుకోండి.

# ఫిఫా ప్రపంచకప్ విజేతలకు తొలిసారి 'ఛాంపియన్‌షిప్ రింగ్స్'





**న్యూయార్క్, జులై 17 ( ):** ఫుట్‌బాల్ ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఫిఫా ప్రపంచకప్--2026లో విజేతగా నిలిచే జట్టుకు ఈసారి సరికొత్త గౌరవం దక్కనుంది. ప్రపంచకప్ చరిత్రలో తొలిసారిగా ట్రోఫీ, బంగారు పతకాలతో పాటు ప్రత్యేకంగా రూపొందించిన 'ఛాంపియన్‌షిప్ రింగ్స్'ను కూడా అందజేయనున్నట్లు ఫిఫా ప్రకటించింది. అమెరికన్ క్రీడల్లో ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ సంప్రదాయాన్ని అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో తొలిసారిగా అమలు చేయనున్నారు. ఫైనల్ మ్యాచ్ ముగిసిన వెంటనే ఈ ప్రత్యేక ఉంగరాల ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. తొలుత విజేత జట్టు కెప్టెన్, ప్రధాన కోచ్‌కు ప్రత్యేక రింగ్స్ అందజేస్తారు. అనంతరం జట్టు సభ్యుల కోసం రూపొందించిన మొత్తం 30 ఒరిజినల్ రింగ్స్‌ను అధికారికంగా బహూకరిస్తారు. ప్రతి రింగ్‌పై ఫిఫా ప్రపంచకప్ ట్రోఫీ ప్రతిరూపంతో పాటు విజేత జట్టుకు సంబంధించిన ప్రత్యేక డిజైన్ ఉంటుంది. ప్రతి ఉంగరానికి ప్రత్యేక సీరియల్ నంబర్‌తో పాటు అసలైనదని ధ్రువీకరించే ప్రమాణపత్రం కూడా అందజేయనున్నారు. ఈ అరుదైన జ్ఞాపకాన్ని అభిమానులకు కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. మొత్తం 2,026 ఛాంపియన్‌షిప్ రింగ్స్‌ను తయారు చేయాలని ఫిఫా నిర్ణయించింది. అందులో 30 రింగ్స్ విజేత జట్టుకు కేటాయించగా, మిగిలిన 1,996 రింగ్స్‌ను అధికారిక లైసెన్స్‌తో ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానులకు విక్రయించనున్నారు. దీంతో ప్రపంచకప్ చరిత్రలో భాగమైన ప్రత్యేక జ్ఞాపకాన్ని అభిమానులు సొంతం చేసుకునే అవకాశం లభించనుంది. ఇదిలా ఉండగా, 2026 ఫిఫా ప్రపంచకప్ తుది సమరానికి రంగం సిద్ధమైంది. ఫైనల్లో యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్, డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా జట్లు తలపడనున్నాయి. సెమీఫైనల్లో ఫ్రాన్స్‌పై విజయం సాధించిన స్పెయిన్ ఫైనల్‌కు చేరుకోగా, అర్జెంటీనా వరుసగా రెండోసారి ప్రపంచకప్ ఫైనల్‌కు అర్హత సాధించి మరో చారిత్రక ఘట్టాన్ని నమోదు చేసింది. ఈ తుది పోరుపై ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది.

# డోపింగ్ కేసులో మొహమ్మద్ నవాజ్‌కు ఊరట



**దుబాయ్, జులై 17 ( ):** పాకిస్థాన్ ఎడమచేతి స్పిన్నర్ మొహమ్మద్ నవాజ్‌కు డోపింగ్ వివాదంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఊరటనిచ్చింది. యాంటీ-డోపింగ్ నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి తొలుత విధించిన మూడు నెలల నిషేధాన్ని చికిత్సా కార్యక్రమం పూర్తి చేసిన నేపథ్యంలో ఒక నెలకు తగ్గించింది. దీంతో నవాజ్ మళ్లీ పోటీ క్రికెట్‌లోకి అడుగుపెట్టేందుకు మార్గం సుగమమైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 7న శ్రీలంకలోని కొలంబోలో నెదర్లాండ్స్‌తో జరిగిన టీ20 ప్రపంచకప్ మ్యాచ్ అనంతరం నిర్వహించిన డోపింగ్ పరీక్షలో నవాజ్ శరీరంలో కార్బాక్సీ-టీహెచ్‌సీ అనే నిషేధిత పదార్థం ఉన్నట్లు తేలింది. ఇది గంజాయిలో ఉండే టీహెచ్‌సీ సమ్మేళనం శరీరంలో మార్పు చెందిన రూపంగా గుర్తించబడుతుంది. నవాజ్ నిబంధనల ఉల్లంఘనను అంగీకరించినప్పటికీ, ఆ పదార్థాన్ని పోటీలకు వెలుపల మాత్రమే ఉపయోగించానని, తన క్రీడా ప్రదర్శనను మెరుగుపరచుకోవడానికి దానిని వినియోగించలేదని ఐసీసీ ఎదుట వివరించాడు. అతని వివరణతో సంతృప్తి చెందిన ఐసీసీ, మాదకద్రవ్యాల దుర్వినియోగ నిరోధక చికిత్సా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తే శిక్షను తగ్గిస్తామని ప్రకటించింది. మే 1 నుంచి అమల్లోకి వచ్చిన తాత్కాలిక సస్పెన్షన్‌ను పరిగణనలోకి తీసుకుని, నవాజ్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు ఐసీసీ వెల్లడించింది. చికిత్సా కార్యక్రమాన్ని పూర్తిగా పూర్తి చేసినందున ఇకపై అదనపు అనర్హత కాలాన్ని ఎదుర్కోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. అయితే, యాంటీ-డోపింగ్ నిబంధనల ప్రకారం ఫిబ్రవరి 7 నుంచి మే 1 వరకు నవాజ్ ఆడిన అన్ని మ్యాచ్‌లలోని వ్యక్తిగత గణాంకాలను అధికారికంగా రద్దు చేశారు. 2026 టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ తరఫున ఏడు మ్యాచ్‌లు ఆడిన నవాజ్ 15 పరుగులు చేసి ఏడు వికెట్లు పడగొట్టాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో ముల్తాన్ సుల్తాన్స్ తరఫున 10 మ్యాచ్‌లలో 54 పరుగులు చేసి ఆరు వికెట్లు సాధించాడు. తాజాగా లంక ప్రీమియర్ లీగ్‌లో గాలె గ్లాడియేటర్స్ తరఫున ఆడేందుకు అవసరమైన నిరభ్యంతర పత్రం కూడా లభించడంతో నవాజ్ త్వరలోనే మళ్లీ పోటీ క్రికెట్‌లో కనిపించనున్నాడు.



# ధోనీ కోసమే సీఎస్‌కేలో..

సంజూ శాంసన్

**చెన్నై, జులై 17 ( ):** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో తన జట్టు మార్పుపై వస్తున్న చర్చలకు చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్ సంజూ శాంసన్ తొలిసారిగా స్పందించారు. మహేంద్ర సింగ్ ధోనీతో కలిసి ఆడాలనే కోరికతోనే చెన్నై సూపర్ కింగ్స్‌లో చేరినట్లు ఆయన వెల్లడించారు. రాజస్థాన్ రాయల్స్‌ను వీడటం తన కెరీర్‌లో అత్యంత కఠినమైన నిర్ణయమని, అయితే కొన్ని పరిస్థితుల కారణంగా ఆ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. దాదాపు పదేళ్లపాటు రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన సంజూ శాంసన్, ఆ జట్టుకు కెప్టెన్‌గా కూడా సేవలందించారు. అయితే ఐపీఎల్--2026 సీజన్‌కు ముందు ప్లేయర్ ట్రేడింగ్ విండో ద్వారా చెన్నై సూపర్ కింగ్స్‌లో చేరడం క్రికెట్ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ఒకే ఫ్రాంచైజీకి సుదీర్ఘకాలం సేవలందించిన ఆటగాడు అకస్మాత్తుగా జట్టు మారడంపై అనేక ఊహాగానాలు వినిపించాయి. తాజాగా జియోస్టార్ నిర్వహించిన 'సూపర్ స్టార్స్ షో'లో మాట్లాడిన సంజూ శాంసన్, తన నిర్ణయం వెనుక ఉన్న కారణాలను వెల్లడించారు. మహేంద్ర సింగ్ ధోనీతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం, ఆయన నుంచి మరింత నేర్చుకోవాలనే ఆకాంక్ష కూడా చెన్నై జట్టులో చేరడానికి ఒక ప్రధాన కారణమని పేర్కొన్నారు. అదే సమయంలో రాజస్థాన్ రాయల్స్‌ను విడిచి రావడం తనకు భావోద్వేగపూరితమైన నిర్ణయమని చెప్పారు. టీనేజ్ ప్రతిభావంతుడు వైభవ్ సూర్యవంశీ జట్టులోకి రావడంతో పరిస్థితులు మారాయని సంజూ శాంసన్ పరోక్షంగా సూచించారు. జట్టు భవిష్యత్ ప్రణాళికలు, ఆటగాళ్ల సమీకరణల నేపథ్యంలో తాను కొత్త నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. అయితే రాజస్థాన్ రాయల్స్‌తో గడిపిన అనుబంధం, అభిమానుల ప్రేమను ఎప్పటికీ మరిచిపోలేనని స్పష్టం చేశారు. ఇక చెన్నై సూపర్ కింగ్స్ తరఫున కొత్త ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగించడమే తన లక్ష్యమని సంజూ పేర్కొన్నారు.

# ఫిఫా ప్రపంచకప్ ఫైనల్‌కు కనువిందైన ముగింపు వేడుక

న్యూయార్క్, జులై 17 ( ): ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫిఫా ప్రపంచకప్--2026 తుది సమరానికి రంగం సిద్ధమైంది. అమెరికాలోని మెట్‌లైఫ్ స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా, యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్ జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. ఈ చారిత్రాత్మక ఫైనల్‌ను మరింత వైభవంగా నిర్వహించేందుకు ఫిఫా తొలిసారిగా భారీ ముగింపు వేడుకతో పాటు ప్రత్యేక హాఫ్‌టైమ్ ప్రదర్శనను ఏర్పాటు చేసింది. మ్యాచ్ ప్రారంభానికి ముందు నిర్వహించే ముగింపు వేడుకల్లో ప్రపంచ ప్రఖ్యాత సంగీత కళాకారులు లారా పౌసిని, నికోల్ షెర్జింగర్, రాబీ విలియమ్స్ తమ ప్రదర్శనలతో అలరించనున్నారు. ప్రముఖ సామాజిక మాధ్యమాల కంటెంట్ సృష్టికర్త ఐషోస్పీడ్ కూడా ప్రత్యేక ప్రదర్శన ఇవ్వనున్నారు. హాలీవుడ్ నటుడు టామ్ క్రూజ్ ప్రత్యేక అతిథిగా హాజరుకానుండగా, అమెరికా జాతీయ గీతాన్ని ప్రముఖ గాయని జెన్నిఫర్ హడ్సన్ ఆలపించనున్నారు. ఫుట్‌బాల్ ప్రపంచకప్ చరిత్రలో తొలిసారిగా అమెరికన్ సూపర్ బౌల్ తరహాలో హాఫ్‌టైమ్ ప్రదర్శన నిర్వహించనున్నారు. సుమారు 11 నిమిషాల పాటు సాగే ఈ కార్యక్రమాన్ని ప్రముఖ సంగీతకారుడు క్రిస్ మార్టిన్ రూపొందించారు. ఇందులో మడోన్నా, షకీరా, జస్టిన్ బీబర్, బీటీఎస్ బృందం, బర్నా బాయ్, గుస్తావో దుదామెల్‌తో పాటు ప్రముఖ బాలల పాత్రలు కూడా సందడి చేయనున్నాయి. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఫిఫా గ్లోబల్ సిటిజన్ ఎడ్యుకేషన్ ఫండ్ సహకారంతో నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా వెనుకబడిన చిన్నారులకు నాణ్యమైన విద్య, ఫుట్‌బాల్ శిక్షణ అందించేందుకు 100 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. భారత కాలమానం ప్రకారం జులై 18 రాత్రి 11 గంటలకు ముగింపు వేడుకలు ప్రారంభం కానుండగా, అర్జెంటీనా--స్పెయిన్ మధ్య ప్రపంచకప్ ఫైనల్ జులై 19 తెల్లవారుజామున 12:30 గంటలకు ఆరంభం కానుంది. భారతదేశంలో ఈ మెగా ఫైనల్‌తో పాటు ముగింపు వేడుకలను టెలివిజన్, డిజిటల్ వేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.






# గంభీర్, కోహ్లీ మధ్య విభేదాల్లేవు

సితాంశు కోటక్

**కార్డిఫ్, జులై 17 ( ):** భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మధ్య విభేదాలు నెలకొన్నాయంటూ సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాన్ని టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ ఖండించారు. వారిద్దరి మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని, జట్టు ప్రయోజనాల కోసం ప్రతిరోజూ అనేకసార్లు పరస్పరం చర్చించుకుంటూ ఉంటారని స్పష్టం చేశారు. ఇంగ్లండ్‌తో కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డే అనంతరం మీడియాతో మాట్లాడిన కోటక్, గంభీర్, కోహ్లీ మధ్య సంబంధాలు ఎంతో స్నేహపూర్వకంగా ఉన్నాయని తెలిపారు. గురువారం ఒక్కరోజే వారిద్దరూ దాదాపు పది సార్లు మాట్లాడుకున్నారని పేర్కొన్నారు. జట్టులోని వ్యూహాలు, మ్యాచ్ పరిస్థితులు, బ్యాటింగ్‌కు సంబంధించిన అంశాలపై తరచూ చర్చలు జరుపుతుంటారని వెల్లడించారు. కొద్ది రోజుల క్రితం బర్మింగ్‌హామ్‌లో జరిగిన భారత జట్టు సాధన సందర్భంగా గంభీర్, కోహ్లీ ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా కనిపించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో విభేదాలపై ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే ఆ ప్రచారానికి ఎలాంటి ఆధారాలు లేవని కోటక్ స్పష్టం చేశారు. కొద్దిసేపు మాట్లాడకపోవడాన్ని విభేదాలుగా చిత్రీకరించడం సరైనది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. విరాట్ కోహ్లీ భవిష్యత్‌పై కూడా కోటక్ స్పందించారు. 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడాలనే కోహ్లీ కోరిక ఇప్పటికీ కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికే ఎన్నో ఘనతలు సాధించిన కోహ్లీకి నిరూపించుకోవాల్సింది ఏమీ లేకపోయినా, జట్టుకు ఉపయోగపడినంతకాలం భారత జట్టుకు సేవలందించాలనే తపనతో ఉన్నాడని చెప్పారు. ఇంగ్లండ్‌తో లార్డ్స్‌లో ఆదివారం జరిగే మూడో, చివరి వన్డేతో ఈ సిరీస్ ముగియనుంది. అనంతరం సెప్టెంబర్‌లో స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో కూడా విరాట్ కోహ్లీ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు జట్టు వర్గాలు వెల్లడించాయి.

# బాలీవుడ్‌లో ఒకరినొకరు తొక్కేయడమే తెలుసు..



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమై తన నటనతో చెరగని ముద్ర వేసుకుంది. టాలీవుడ్ స్టార్ హీరోలందరి సరసన నటించి టాప్ హీరోయిన్‌గా నిలిచిన ఈ భామ, కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే బాలీవుడ్‌కు చెక్కేసింది. ప్రస్తుతం హిందీలో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న రకుల్, ఇటీవల వచ్చిన 'పతి పత్నీ ఔర్ వో దో' చిత్రంతో ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం ఆమె 'రామాయణ పార్ట్-2', 'నాగిల్లా' వంటి భారీ సినిమాల షూటింగ్స్‌తో ఫుల్ బిజీగా గడుపుతోందిఅయితే, తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన రకుల్.. తెలుగు, హిందీ చిత్ర పరిశ్రమల మధ్య ఉన్న తేడాల గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. టాలీవుడ్ పద్ధతులు చాలా బాగుంటాయని చెప్తూ మన తెలుగు ఇండస్ట్రీపై ప్రశంసలు కురిపించింది. బాలీవుడ్ పరిశ్రమతో పోలిస్తే తెలుగు సినీ పరిశ్రమ ఎంతో సహాయకారిగా, ఐక్యంగా ఉంటుందని రకుల్ చెప్పింది.
బాలీవుడ్‌లో నటీనటుల మధ్య అభద్రతాభావం , అసూయ ఎక్కువగా ఉంటాయని.. అందుకే అక్కడ ఒకరి సినిమాలకు మరొకరు మద్దతు ఇవ్వరని ఆమె అభిప్రాయపడింది.
అంతేకాకుండా, ఒకరి సినిమాలపై మరొకరు నెగిటివ్ ప్రచారం కూడా చేసుకుంటారని ఒకరినొకరు తొక్కేయడమే అక్కడివాళ్లకి తెలుసని రకుల్ సంచలన వ్యాఖ్యలు చేసింది. కానీ, మన తెలుగు ఇండస్ట్రీలో మాత్రం వాతావరణం చాలా భిన్నంగా ఉంటుందని చెప్పిందిటాలీవుడ్‌లో ప్రతి ఒక్కరూ వేరే హీరోల ట్రైలర్లను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ప్రమోట్ చేస్తారని, ఒకరి విజయాలను మరొకరు మనస్ఫూర్తిగా ఎంజాయ్ చేస్తారని రకుల్ గుర్తుచేసింది. ఇక్కడ అందరూ కలిసికట్టుగా ఉంటారని ప్రశంసించింది. ఒకవేళ బాలీవుడ్ కూడా తెలుగు ఇండస్ట్రీ లాంటి ఐక్యతను, మంచి గుణాన్ని అలవర్చుకుంటే.. మన దేశంలోనే మన సినిమా పరిశ్రమ అత్యంత బలమైనదిగా మారుతుందని రకుల్ ప్రీత్ సింగ్ చెప్పకొచ్చింది.

టాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీలకు అదృష్టం కలిసిరావడం లేదు. తన టాలెంట్ చూపించినప్పటికీ నిరాశనే ఎదురవుతోంది. ఆమె ఇటీవల నటించిన చిత్రాలు వరుసగా బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలయ్యాయి. ముఖ్యంగా భారీ అంచనాలతో వచ్చిన 'ఉస్తాద్ భగత్ సింగ్', 'పరాశక్తి' వంటి సినిమాలు ప్రేక్షకులను మెప్పించలేకపోవడంతో ఈ భామపై విమర్శలు వస్తున్నాయి. ఈ వరుస ఫ్లాపుల వల్ల ఆమెను కొన్ని సినిమాల నుండి తొలగిస్తున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో జోరందుకుంది. దీనికి తోడు నెట్టింట ట్రోలింగ్ కూడా గట్టిగానే జరుగుతోంది. ఈ నేపథ్యంలో, తాజాగా జరిగిన ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రీలీల ఆసక్తికర కామెంట్స్ చేసింది. తన అభిమానుల కోసం తాను ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా స్పష్టం చేసింది.
తనకు అభిమానులను నేరుగా కలుసుకోవడం ఎంతో ఇష్టమని, వారి చూపే ప్రేమ, ఉత్సాహం తనకు కొత్త ఎనర్జీని ఇస్తాయని చెప్పకొచ్చింది. తనలాంటి కళాకారులను ఎల్లప్పుడూ బ్రతికించేది ప్రేక్షకులేనని, అందుకే వారిని అలరించేందుకు భవిష్యత్తులో మరింత శ్రమించి మంచి సినిమాలను అందిస్తూనే ఉంటానని శ్రీలీల తన పేర్కొన్నారు. ఒకపక్క తెలుగులో ఎదురుదెబ్బలు తగులుతున్నా.. ఈ ముద్దుగుమ్మ క్రేజ్ మాత్రం తగ్గడం లేదు. ప్రస్తుతం ఆమె తమిళ, హిందీ భాషల్లోని స్టార్ హీరోల సరసన అవకాశాలు దక్కించుకుంటూ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ధనుష్ సరసన 'D-55' సినిమాలో నటిస్తూ బిజీగా ఉంది. వీటితో పాటు బాలీవుడ్‌లో కూడా అడుగుపెడుతూ.. క్రేజీ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన మోస్ట్ అవేటెడ్ లవ్ సాగా 'ఆషికి-3' సినిమాలో హీరోయిన్‌గా ఎంపికైంది.



## నన్ను బ్రతికిస్తున్న అభిమానుల కోసం ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నాను



## భర్త ఎఫైర్ పెట్టుకుంటే వదిలేయండి పెద్ద ఇష్యూ చేయొద్దు..

టాలీవుడ్ హీరో రాజశేఖర్ భార్య, నటి జీవిత ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత ఇండస్ట్రీకి కాస్త దూరంగా ఉన్నప్పటికీ.. తన భర్తకు అన్ని విషయాల్లో తోడుగా నిలుస్తూ వస్తున్నారు. నటనకు దూరం అయినా.. సామాజిక అంశాలపై మాత్రం సెన్సేషనల్ కామెంట్స్ చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా, ఒక ఇంటర్వ్యూలో పాల్గొని భార్యాభర్తల బంధాలు, వివాహేతర సంబంధాలపై జీవిత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట దుమారం రేపుతున్నాయి. ఈ రోజుల్లో ఎవరూ శ్రీరామచంద్రుడిలా ఉండరని, తాను చేసే టీవీ షోలలోనూ ఇదే విషయాన్ని చెబుతుంటానని జీవిత స్పష్టం చేశారు. ఒక పురుషుడు వేరే మహిళతో పబ్లిక్‌గా తిరుగుతూ, తనకు అఫైర్ ఉందని బహిరంగంగా చెబితే.. అలాంటి వాడితో ఏ భార్య కూడా ఉండాల్సిన అవసరం లేదని అన్నారు. అయితే, కేవలం ఒక చిన్న అట్రాక్షన్‌తో భార్యకు తెలియకుండా, రహస్యంగా ఎఫైర్ పెట్టుకుంటే దాని గురించి భార్యలు పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదంటూ ఆమె షాకింగ్ కామెంట్స్ చేశారు. భార్యను ప్రేమిస్తున్నాడు కాబట్టే ఆ విషయాన్ని దాచాడని, మనం ప్రతిరోజూ ఒకే హోటల్‌లో భోజనం చేయం, ఒకే రకమైన బట్టలు వేసుకోం కదా.. అలాగే ఏదో కొత్తదనం కోసం భర్త ఆ తప్పు చేసి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. ఆ విషయం తర్వాత తెలిసినా సరే, దానిని పెద్ద ఇష్యూ చేయకుండా వదిలేయడమే మంచిదని హితవు పలికారు. కానీ, ఇంకో పెళ్లి చేసుకుని, వేరే ఫ్యామిలీ పెట్టి, మొదటి భార్యాపిల్లలను రోడ్డున పడేస్తే మాత్రం అలాంటి వాడిని అస్సలు క్షమించొద్దని చెప్పారు. భర్త తప్పు చేస్తే భార్య క్షమించాలన్నప్పుడు, భార్య కూడా అలాగే చేస్తే మొగుడు కచ్చితంగా ఒప్పకోవాల్సిందేనని, ఆమెను కూడా క్షమించాలని స్పష్టం చేశారు. తన దగ్గరకు ఇలాంటి కేసులు చాలానే వచ్చాయని తెలిపారు. పూర్వం మగాడు బయటకు వెళ్లి సంపాదిస్తాడు కాబట్టి వాడే గొప్ప అనేవారని.. కానీ బయటకు వెళ్లి సంపాదించడం ఎంత పెద్ద పనో, ఇంట్లో ఉండి కుటుంబాన్ని చక్కబెట్టడం అంతకంటే పెద్ద పనని జీవితా రాజశేఖర్ పేర్కొన్నారు. ప్రస్తుతం జీవిత కామెంట్స్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఇక ఈ విషయం తెలుసుకున్న వారంతా ఆమెపై విమర్శలు చేస్తున్నారు.

# విజయ్ దేవరకొండ మూవీకి బ్రేక్..



సినీ పరిశ్రమలో ఎంతో నమ్మకంతో సినిమాను ప్రారంభించినప్పటికీ, చిత్రీకరణలో కొంత భాగం పూర్తయ్యాక అవుట్‌పుట్ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ప్రాజెక్టులను నిలిపివేసిన సందర్భాలు చాలానే ఉన్నాయి. అలాంటి సంఘటనే విజయ్ దేవరకొండ కెరీర్‌లోకూడా చోటుచేసుకుంది. ఆ వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. 2019లో విజయ్ దేవరకొండ హీరోగా నటించిన 'డియర్ కామ్రేడ్' సినిమా విడుదలైంది. అయితే ఈ చిత్రం ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. అనంతరం ఆనంద్ అన్నామలై దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో 'హీరో' అనే టైటిల్‌తో స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఓ సినిమాను ప్రారంభించారు. ఇందులో విజయ్ ప్రొఫెషనల్ బైక్ రేసర్ పాత్రలో నటించాల్సి ఉంది. ఈ చిత్రంలో మాళవిక మోహనన్, శాలిని పాండే హీరోయిన్లుగా ఎంపికయ్యారు.
ఈ సినిమా ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించడంతో పాటు, తొలి షెడ్యూల్‌ను సుమారు రూ.6 కోట్ల వ్యయంతో చిత్రీకరించారు. అయితే మొదటి షెడ్యూల్ అవుట్‌పుట్‌ను చూసిన తర్వాత విజయ్ దేవరకొండ పూర్తిగా సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. దీంతో స్క్రిప్ట్‌లో మార్పులు చేయాలని భావించినప్పటికీ, ఆ విషయంలో దర్శకుడు హీరో, నిర్మాతలను పూర్తిగా ఒప్పించలేకపోయాడని సమాచారం. తర్వాత ఈ సినిమా మళ్లీ ప్రారంభం కానుందని వార్తలు వచ్చినా, విజయ్ వరుస సినిమాలతో బిజీ కావడంతో ఈ ప్రాజెక్ట్ పూర్తిగా పక్కన పడిపోయింది. దీంతో విజయ్ దేవరకొండ - మైత్రి మూవీ మేకర్స్ కాంబినేషన్‌లో తెరకెక్కాల్సిన 'హీరో' సినిమా తొలి షెడ్యూల్ పూర్తైన తర్వాతే నిలిచిపోయింది. ప్రస్తుతం మాత్రం విజయ్ దేవరకొండ, మైత్రి మూవీ మేకర్స్ కాంబినేషన్‌లో 'రణబాలి' చిత్రం తెరకెక్కుతుండగా, ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.

# ఆ సినిమా నా జీవితాన్నే మార్చేసింది..



ప్రముఖ నటుడు, రచయిత పోసాని కృష్ణమురళి తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తన సినీ కెరీర్‌కు కీలక మలుపు తీసుకొచ్చిన 'నాయక్' సినిమా గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. పోసాని మాట్లాడుతూ.. నా కెరీర్‌ను పూర్తిగా మార్చేసిన చిత్రాల్లో 'నాయక్' మొదటి స్థానంలో ఉంటుంది. ఆ సినిమాకు వి.వి. వినాయక్ దర్శకత్వం వహించారు. ఆయనంటే నాకు ఎంతో అభిమానం. నేను ఆయనను ప్రేమగా 'వినయ్' అని పిలుస్తాను. ఆయన నన్ను 'మురళి' అని పిలుస్తారు.
ఒకసారి నేను మరో సినిమా షూటింగ్ కోసం ప్రయాణిస్తుండగా వినయ్ ఫోన్ చేసి 'రామ్ చరణ్ హీరోగా 'నాయక్' సినిమా చేస్తున్నాను. అందులో మీ కోసం మంచి కామెడీ పాత్ర ఉంది. మూడు రోజులు డేట్స్ అడ్జస్ట్ చేయగలరా?' అని అడిగారు. నేను వెంటనే అంగీకరించాను. మొదటి రోజు షూటింగ్‌లోనే నా డైలాగ్‌లకు యూనిట్ మొత్తం పగలబడి నవ్వింది. ఆ రోజు షూటింగ్ పూర్తయ్యాక మరుసటి రోజు వినయ్ వచ్చి 'మీ సన్నివేశాలకు అందరూ అద్భుతంగా స్పందిస్తున్నారు. మీ పాత్రను మరింత పెంచుదాం' అన్నారు.
అలా మూడు రోజుల పాత్ర కాస్త 17 నుంచి 18 రోజుల షూటింగ్‌గా మారింది. అంతేకాకుండా సినిమా విడుదలకు ముందు చిరంజీవి తన సన్నివేశాలు చూసి ఎంతో నవ్వారని, ఒక్క సీన్ కూడా కట్ చేయొద్దు అని దర్శకుడు వినాయక్‌కు సూచించారని పోసాని చెప్పారు. సినిమా విడుదలైన తర్వాత ప్రేక్షకుల నుంచి తన పాత్రకు అద్భుతమైన స్పందన వచ్చిందని, విడుదలైన వారం రోజుల్లోనే ఏకంగా 36 సినిమాల్లో నటించే అవకాశాలు వచ్చాయని పోసాని కృష్ణమురళి తెలిపారు. 'నాయక్' తన సినీ ప్రయాణంలో అత్యంత కీలకమైన చిత్రంగా ఎప్పటికీ గుర్తుండిపోతుందని ఆయన పేర్కొన్నారు.

# ఒక్క అప్డేట్‌తో ఐదు సినిమాల ఆశలపై నీళ్లు చల్లిన ప్రభాస్

ఈ ఏడాది డిసెంబర్ నెలలో అనేక భారీ చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నట్లు గత కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. ఇలాంటి సమయంలోనే ప్రభాస్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'ఫౌజీ' చిత్రాన్ని డిసెంబర్ 3న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో డిసెంబర్‌లో విడుదలకు ప్లాన్ చేస్తున్న ఇతర చిత్రాల పరిస్థితి ఏంటనే చర్చలు సినీ వర్గాల్లో మొదలయ్యాయి. ఈ ఏడాది డిసెంబర్‌లో తెలుగు చిత్రాలతో పాటు పలు హిందీ సినిమాలు కూడా విడుదలకు సిద్ధమవుతున్నాయి.
బాలకృష్ణ - గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో 'ఎన్‌బీకే 111' వర్కింగ్ టైటిల్తో రూపొందుతున్న చిత్రాన్ని దసరా లేదా డిసెంబర్‌లో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. అలాగే చిరంజీవి - బాబీ కొల్లి కాంబినేషన్‌లో 'మెగా 158' వర్కింగ్ టైటిల్ తో రూపొందుతున్న చిత్రాన్ని కూడా డిసెంబర్‌లో విడుదల చేయాలని చూస్తున్నారు. ఇక నాగచైతన్య హీరోగా కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వృషకర్మ' చిత్రాన్ని కూడా డిసెంబర్‌లోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.
వీటితో పాటు అజయ్ దేవ్‌గన్, సంజయ్ దత్, తమన్నా ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న 'రేంజర్', అలాగే అనీస్ బజ్మీ దర్శకత్వంలో అక్షయ్ కుమార్ నటిస్తున్న మరో హిందీ చిత్రం కూడా డిసెంబర్ విడుదలకే సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభాస్ 'ఫౌజీ' అదే నెలలో విడుదల కానుండటంతో మిగతా చిత్రాల విడుదల తేదీలపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో డిసెంబర్ బాక్సాఫీస్ పోరు మరింత ఆసక్తికరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.



## ఇప్పుడున్న టాలీవుడ్ స్టార్స్‌లో ఆ ఇద్దరంటే చాలా ఇష్టం



సీనియర్ స్టార్ హీరోయిన్లలో ఒకరైన రంభ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఎన్నో సంవత్సరాల పాటు తెలుగు సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా కొనసాగిన ఆమె తన అందం, నటనతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటున్న రంభ, పలు టెలివిజన్ షోల్లో జడ్జిగా వ్యవహరిస్తూ బుల్లితెర ప్రేక్షకులను అలరిస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రంభ ప్రస్తుతం తనకు అత్యంత ఇష్టమైన ఇద్దరు టాలీవుడ్ స్టార్ హీరోలు ఎవరో వెల్లడించింది.
ఆమె మాట్లాడుతూ... ప్రస్తుతం తెలుగు సినీ పరిశ్రమలో ఉన్న హీరోల్లో ప్రభాస్, మహేష్‌బాబు అంటే నాకు చాలా ఇష్టం. వారిద్దరూ తమ అద్భుతమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. వారి నటనను నేను ఎంతో అభిమానిస్తాను. వీరిద్దరిలో ఎవరితో సినిమా చేసే అవకాశం వచ్చినా చాలా సంతోషిస్తాను. ఇద్దరితో కలిసి నటించే అవకాశం వస్తే ఇంకా ఆనందంగా ఉంటుందని చెప్పింది. రంభ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా ఈ తరం స్టార్ హీరోల్లో అల్లు అర్జున్ నటించిన 'దేశముదురు' చిత్రంలోని ఐటమ్ సాంగ్లో రంభ కనిపించి ప్రేక్షకులను అలరించిన విషయం తెలిసిందే.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com